# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 38 సంచిక 5

పేజీలు 44

జనవరి 2019

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** .............................. ....... **పేజీ**


భద్రవాక్యం ........................................................4

శ్రీబాబూజీ ఉవాచ.............................................. 6

అమ్మమాట.......................................................... 9

శ్రీబాబు బృందావన ధామము-
శ్రీ స్వామినారాయణ్
అక్షరధామము ................................11

రాధా తత్త్వం ............................ ...........................13

దేవుడు ఉన్నాడా? .................................................16

చింతయ్య ......................... ....................................18

హైదరాబాద్ శాఖలో కార్యక్రమాలు....21

దీపం వుండగానే యిల్లు
చక్కబెట్టుకోవాలి ........................22

అభయ హస్తం ...................................................24

మోక్షానికి అందరూ అర్హులే ..................27

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.............................28

శ్రీకృష్ణ కర్ణామృతము ..........................................29

స్వామి తురీయానంద ...................................... 30

పరిప్రశ్న ............................................................. 31

యమునాచార్యుడు ............................................33

సత్యభామ ....................................... ......... 35

కైవల్యోపనిషత్ ... ............................................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ...... ............................ ....................41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

## అమృతబిన్దూపనిషద్

4. **నిరస్త విషయాసంగం సన్నిరుద్ధం మనో హృది।**
**యదా యాత్యాత్మనోభావమ్ తదా తత్పరమం పదమ్ ॥**

సాధకుడు ఆత్మానుభూతిని లేదా ముక్త స్థితిని లేదా పరమపదాన్ని చేరుకోవాలంటే తన మనస్సుని సంస్కరించుకోవాలి. మనస్సు సహజంగా జన్మాంతర వాసన లేదా సంస్కార హీనత చేత విషయాసక్తమై వుండటం దాని సహజ లక్షణం. మనస్సు విషయాసక్తిని నిరుద్ధ స్థాయిలో త్యజించాలి. అంటే నిరుద్ధ స్థాయిలో ఎంతమాత్రము మినహాయింపు అనేది ఉండదు. మనస్సు పూర్ణంగా తత్త్వ భావనలో నిలిచిపోవాలన్న మాట. తత్త్వ భావము అన్నా ఆత్మ భావము అన్నా ఒకటే సుమా!

తత్త్వము అంటే 'తత్' అది 'త్వం' అంటే నీవు అని తెలియజేసే దన్నమాట. ఆత్మ అంటే 'నేను' అనేది అందరికీ తెలిసిన విషయమే. ఆత్మ భావన అంటే తనని గురించిన పరిపూర్ణ పరిమితి లేని విస్తార అపరిమిత భావన. ఇంక ఏమాత్రం అన్య భావన లేకపోవుట అన్నమాట. అక్కడ ద్వైతానికి తావు వుండదు. 'నేను' అంటే ప్రాపంచికంగా మానవులంతా చేసే భావన దేహానికి పరిమితమైనదిగా లేక దేహేంద్రియాదులకు పరిమితమైనదిగా లేక విషయాదులకు పరిమితమైనదిగా లేదా భావన చేసే పరిమిత జ్ఞానానికి సంబంధించినదిగా వుండవచ్చు.

అందువలన మానవులంతా 'నేను' అనే భావనలో దేహం యొక్క భావననే పొందుతున్నారు. ఆత్మ భావాన్ని పొందటం లేదు. అసలు 'నేను' అనేది ఒక దేహానికి గాని, ఇంద్రియానికి గాని, విషయానికి గాని, రూప, నామ, క్రియలకు గాని పరిమితమైనది ఎంత మాత్రము కాదు. పరిమిత భావన బంధానికి దారి తీస్తుంది. లక్ష్యార్థానికి దూరమవుతుంది. అంతేకాదు. ఆ భావనలో మనస్సు ప్రవేశించి ఆత్మకి భిన్నంగా వ్యవహరిస్తుంది. అక్కడ చంచలత్వము, ద్వైతభావన, నానాత్వము ప్రస్ఫుటంగా కానవస్తాయి. అటువంటి స్థితిని

అధిగమించాలంటే సాధకుడు ద్వైత రూపంగా వున్న తన మనస్సును ఆత్మలో లయింపజేయాలి. అది స్థిరమైన స్థితి. దానిని చేరటానికి విషయాసక్తిని సంపూర్ణంగా త్యజించాలి. అది మనస్సు యొక్క సదవగాహనపై ఆధారపడి వుంటుంది.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**జనవరి 2019**

14 సోమ - భోగి -రాత్రి 7గం.లకు శ్రీ సద్గురుపాదపూజ, భోగిపళ్ళు.

15 మంగళ - మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

21 సోమ - పుష్య పౌర్ణమి - రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

30 బుధ - శ్రీగురుదశమి - రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

ఫిబ్రవరి 2019

15 శుక్ర నుండి 19 మంగళవారం వరకు పంచాహ్నిక సత్సంగ సమావేశముల వివరములు :

నిత్యకార్యక్రమములు -

ఉదయం 5గం.లకు ప్రార్థన; 6-30ని॥ నగర సంకీర్తన; 7-30ని॥ భోగం 9-30 గం. సంకీర్తన, 10గం.లకు శ్రీ రామానుజదాసుగారిచే ప్రవచనం. 11గం.లకు శ్రీసద్గురుదేవుల పాదపూజ, తీర్థ ప్రసాదములు తదుపరి భక్తసమరాధన..

సా॥ 5గం.లకు సంకీర్తన, 6గం. నుండి రాత్రి 8గం. వరకు సత్సంగ సమావేశములు, శ్రీమాతాజీవారి అనుగ్రహ భాషణము. తదుపరి ప్రసాద వితరణ.

ప్రత్యేక కార్యక్రమములు

14 గురువారం రాత్రి 7గం. తెప్పోత్సవము

15 శుక్రవారం ఉదయం 9గం. సామూహిక కుంకుమ పూజలు. శ్రీసద్గురుపాదపూజ

16 శనివారం భీష్మ ఏకాదశి. ఉదయం 6గం.ల ఏకాహం సంకీర్తన.

19 మంగళ : మాఘ పౌర్ణమి - సత్సంగం, శ్రీ గురు పాదపూజ, భక్త సమారాధన.

28 గురు - శ్రీ గురుదశమి - రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ

# శ్రీబాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

గొల్ల వెంకన్నకు ఎంతకూ భగవత్సాక్షాత్కారం కాలేదు. చివరకు ఒకనాడు తన పశువులను, గొర్రెలను వదిలివేసి భగవద్ధ్యానం చేస్తూ తన తలను అక్కడున్న రాతిపై కొట్టుకుంటాడు. పరమాత్మునికి భక్తులంటే అత్యంత ప్రేమ, అనురాగము అయినప్పటికీ భక్తులను పరీక్షిస్తాడు. గొల్ల వెంకన్న కోరిన విధంగానే తెల్ల గద్దపై శ్రీమన్నారాయణమూర్తి సాక్షాత్కరించి పాయసాన్ని భుజిస్తాడు. ఈ విధంగా ఆ భక్తుడు కోరిన విధంగా నిత్యమూ జరుగుతూ ఉంటుంది.



గొల్ల వెంకన్న గురువుగారు ఒకరోజు ఆ దారిన తిరిగివస్తూ విషయం తెలిసి ఆశ్చర్యపోతాడు. గొల్లవెంకన్నకేమిటి? భగవత్సాక్షాత్కారవేమిటి? నేను సాధించలేనిది ఈ గొల్లవాడు సాధించాడా? ఇది నమ్మశక్యం కాకుండా ఉన్నదే? ఇదేదో పరీక్షించవలసిందే అని అనుకొని ఆ పండితుడు ఆ సమీపముననే ఉన్న మర్రిచెట్టు వెనుక దాక్కొని పొంచి చూస్తూ ఉంటాడు.

వెంకన్న ప్రార్థన చేసిన వెంటనే ఒక గ్రద్ద రివ్వున వచ్చిన శబ్దము, వెంకన్న ఎవరితోనో సంభాషించటం, పాయసం అదృశ్యమవటం చూస్తాడు. కాని శ్రీమన్నారాయణమూర్తిని మాత్రం ఆ పండితుని నేత్రాలు దర్శించలేకపోయాయి. ఎలా చూడగలుగుతాయి? ఆయనను చూడటానికి ఎంత సాధన కావాలి? ఎంత జ్ఞానం కావాలి? పండితుని సంస్కారం చిలకలపూడి బంగారం. వెంకన్న సంస్కారం మేలిమి బంగారం.

గొల్లవెంకన్న, గురువుగారికి నమస్కరించి 'ఈరోజు శ్రీమన్నారాయణుడు కుమారా! నేను వైకుంఠము నుంచి ఇక్కడకు రావటం, పాయసం ఆరగించటం ఎందుకు? నిన్ను రేపు నాతో

వైకుంఠానికి తీసుకొని వెళతాను. సిద్ధంగా ఉండు అన్నాడు' అని నివేదిస్తాడు. అవును మరి గొల్ల వెంకన్న జ్ఞానశీలుడయ్యాడు. సాధన సఫలమైంది. అతని తేజస్సు పరమాత్మ యొక్క దివ్య తేజస్సులో లీనమయ్యే సమయం ఆసన్నమైంది. లీనమవుతుంది.

పండితుడు ఈ విషయం తెలుసుకొని, తన శిష్యుడు వైకుంఠం వెళుతున్నాడని లోపల విచారిస్తూ, వెంటనే ఒక ఉపాయం ఆలోచించి అతనితోపాటు తానుకూడా వైకుంఠం వెళ్ళే పథకం తయారుచేస్తాడు. అతడు గొల్లవెంకన్నను పిలిచి 'శిష్యా! రేపు వైకుంఠవాసి వచ్చి నిన్ను వైకుంఠానికి తీసుకొని వెళ్ళేటప్పుడు నేను నీ కాళ్ళు పట్టుకొని ఉంటాను. నన్ను కూడా నీతో తీసుకొని వెళ్ళమని అడుగు. శ్రీమన్నారాయణమూర్తికి నేనే నీకు మంత్రోపదేశం చేసి ముక్తిని లభింపజేసిన గురువునని చెప్పు అంటాడు. దానికి గొల్లవెంకన్న అంగీకరిస్తాడు.

ఆ మర్నాడు అనుకున్న ప్రకారమే వైకుంఠవాసి తెల్లగద్దపై వచ్చి గొల్లవెంకన్నను తన ఒడిలో కూర్చోబెట్టుకొని వెళుతున్న సమయంలో అక్కడే మర్రిచెట్టు చాటున దాగి ఉన్న పండితుడు పరుగున వచ్చి వెంకన్న పాదాలు పట్టుకుంటాడు. ఇది చూసిన శ్రీమన్నారాయణుడు 'వెంకన్నా! ఈ పండితుడు స్వార్థపరుడు. నీవు కులం తక్కువవాడివి అని, నువ్వు భ్రష్టుడవు అవ్వాలని ఒక నకిలీ మంత్రాన్ని ఉపదేశించాడు. ఇటువంటి పాపాత్ములకు స్వర్గలోకంలో స్థానంలేదు సరికదా! నరకలోకంలో కూడా చాలా హీనమైన స్థానం లభిస్తుంది. కాబట్టి అతనిని వదిలిపెట్టు' అంటాడు.

కాని గొల్ల వెంకన్న సంస్కారవంతుడు కాబట్టి 'ఈ పండితుడు ఎటువంటివాడైనా సరే నా గురుదేవుడు, నాకు వైకుంఠం ప్రాప్తింపచేసిన మహాత్ముడు. నా గురుదేవునికి లేని వైకుంఠం నాకూ వద్దు. నా గురుదేవుని పాదములు నాకు చాలు' అంటాడు శ్రీమన్నారాయణ మూర్తితో. గొల్లవెంకన్న గురుభక్తికి మెచ్చి ఇరువురికి వైకుంఠ లోకం ప్రాప్తింపజేస్తాడు వైకుంఠవాసి. గురువుకి ఘనత తెచ్చిపెట్టగల శిష్యుడు లభించటం ఎంతో అదృష్టం. శ్రీ వివేకానంద, రామకృష్ణ పరమహంసకు అట్టి ఘనతే తెచ్చిపెట్టాడు.

గురువు ఎటువంటి వాడైనప్పటికీ, శిష్యుడు ఆచార్యుని యందు అచంచల భక్తి విశ్వాసము కలిగి ఉన్నప్పుడే ఆ శిష్యుడు తన లక్ష్యార్థాన్ని

సాధిస్తాడు. ద్రోణాచార్యుడు అస్త్రవిద్య నేర్పటానికి నిరాకరించినపుడు, ఒక మట్టిబొమ్మను చేసి ఆచార్యునిగా భావించి ఏకలవ్యుడు అస్త్రవిద్య నేర్చుకోలేదా! అతడికి ఏ శక్తి తోడ్పడింది. అదే గురు లక్ష్యార్థము!

శస్త్రవిద్యలో ప్రావీణ్యత గడించిన ఏకలవ్యుడు, తన గురువైన ద్రోణాచార్యునికి గురుదక్షిణగా తన చేతి బొటనవేలిని కోసి యిచ్చినప్పుడు, తన గురువుయందు అతనికి గల భక్తి విశ్వాసంలో ఎక్కడైనా మచ్చ వుందని ఎవరైనా చెప్పగలరా? అలాగే గొల్లవెంకన్న తన గురువును గురుదక్షిణగా, తనతో పాటు వైకుంఠానికి తీసుకువెళ్ళటానికి, ఎంతో త్యాగం చేయటానికి సిద్ధపడ్డాడు. అట్టి శిష్యుడు లభించిన గురువు యొక్క ఆశయం సిద్ధించినట్లే కదా!" అన్నారు శ్రీ బాబు.

### *జనవరి2019లో శ్రీ మాతాజీవారి ఆశ్రమేతర సత్సంగ కార్యక్రమాలు*

23-1-2019 గుండుగొలనులో జరిగే శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో పాల్గొంటారు

25-1-2019 సాయంత్రం విజయనగరంలో జరిగే శ్రీ దేవానంద స్వామి వారి కార్యక్రమాలలో పాల్గొంటారు.

జనవరి 26 నుండి 30వ తేదీ వరకు హైదరాబాద్ ఆశ్రమ బ్రాంచ్‌లో జరిగే అయిదు రోజుల సత్సంగ సమావేశాలలో పాల్గొంటారు.

### *ఫిబ్రవరి2019లో శ్రీ మాతాజీవారి ఆశ్రమేతర సత్సంగ కార్యక్రమాలు*

3 నుండి 11 వరకు - ముంబయిలో సత్సంగ కార్యక్రమములు.

13 - బీదర్‌స్వామి శ్రీ శివానంద భారతి స్వామివారి కార్యక్రమంలో పాల్గొంటారు.

15 నుండి 19 వరకు - పెదనిండ్రకొలను బ్రాంచిలో సత్సంగ కార్యక్రమాలు. 16వ తేదీ శ్రీస్వామివారి మూర్తి ప్రతిష్ఠ వార్షికోత్సవము.

21 నుండి 25 వరకు - విశాఖపట్నంలో శ్రీదాసరి చిన్నబ్రహ్మయ్యగారి (సెల్. 99490 88052 ) ఆధ్వర్యంలో సత్సంగాలు జరుగుతాయి.

27 నుండి మార్చి 1వ తేదీ వరకు - గుండుగొలను బ్రాంచిలో వార్షిక సత్సంగ సమావేశములు జరుగుతాయి.

(గత సంచిక తరువాయి) **అమ్మమాట** - జపమాల ప్రసాద

## 'వాసనా క్షయ మయితేనే వాసుదేవ దర్శనం'

సాధనలో మనకి అడ్డువచ్చేది ప్రతీదీ వాసనే. తద్వారా పునరావృత్తి తప్పదు. పునరావృత్తి వద్దు అనుకునే మానవుడు వాసనలనే విత్తనాలను వేయించివేయాలి. అది మూకుడులో వేసి వేయించడం కాదు. వాసనలను కేవలం విచారణ ద్వారా మాత్రమే వేయించగలము. మనం చూసే ప్రపంచంలో, నడిచే నడకలో, వినే శబ్దంలో, ఆలోచించే ఆలోచనలో, చూసే దృశ్యంలో మన మనస్సు యొక్క స్థితి (స్టేటస్) ప్రతిబింబిస్తుంది. దీనికే వివేకదృష్టి కావాలి. దీనినే నిత్యాఉనిత్య వస్తు వివేకదృష్టి అని కూడా అంటారు.



ఒక మాట మాట్లాడాలి అంటే, 'ఇది నాకు అవసరమా?' అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. ఆ మాట వలన ఎవరికైనా మంచి జరుగుతుంది అంటే మాట్లాడు. లేకపోతే మాట్లాడకుండా మౌనంగా ఉండటమే ఉత్తమము. లేదా ఎదుటివారికి మేలు కలగాలని ప్రార్థించు చాలు. అనవసరమైన విషయాలను మాట్లాడటం వలన, చర్చించడం వలన, లేనిపోని కర్మను మూటకట్టుకుంటావు. అదే శ్రీస్వామివారు ఒక కీర్తనలో చెప్పారు 'కానివి పోనివి కర్మముల్ చేసి కాలుని బారిని పడెదవేలరా?' అని.

ఆనాడు హనుమ సముద్రాన్ని లంఘిస్తున్నప్పుడు సింహిక అనే ఛాయగ్రాహి ఆయన నీడని పట్టి మ్రింగినట్లు, ఈ ప్రపంచమనే సింహిక మనలను పట్టుకుని ఈడ్చుకు పోతుంది. ఎవరో ఏదో మాట్లాడుతుంటే, నువ్వు అందులో తల దూర్చావంటే, నువ్వందులో ఇరుక్కుపోతావు. అదే నువ్వు కాస్త విచారణ చేసుకుని, 'ఈ మాటలు నాకు అవసరం లేదు. అని మౌనంగా వుండిపోతే అది ఉత్తమం'. ఈ ప్రపంచంలో జ్ఞానేంద్రియాల ద్వారా వినడం, కనడం, అన్నిటిలోనూ వివేక దృష్టిని కలిగి ఉండటమే వైరాగ్యం అంటే.

టి.వి. సీరియల్స్ చూడాలన్నదీ వాసనే. అవన్నీ చూస్తూ వైరాగ్యం రావాలంటే ఎలా వస్తుంది? వాటిని వదిలివేయడం వలన పుణ్యం

వస్తుంది. ప్రపంచ విషయంలో అవగాహన కావాలి. ప్రపంచమనే వాసనని వదిలించుకోవడానికే ఇక్కడకు వచ్చాము.

తినే విషయంలో నాకు అదే కావాలి అని కూర్చుంటే అది వాసన అవుతుంది. ఆరోగ్యరీత్యా ఫలానాది తినకూడదు, ఫలానాది తినవచ్చు అని అనుకోవటం ఫరవాలేదు. కానీ జిహ్వకి లోబడి, 'రోజూ ఉప్మాయేనా! అని వేరేవేరే వస్తువులను కోరుకోవడం అది జిహ్వాచాపల్యం అనిపించు కుంటుంది. అది మంచిది కాదు. మనం కేవలం ఈ శరీరాన్ని నిలబెట్టు కోవడానికే కదా తినాలి!

ఈ ప్రపంచంలో ఉంటూ కూడా దానికి అంటుకుపోకుండా వుండాలంటే, వివేకం, వైరాగ్యం కలిగి వుండాలని మహాత్ములు నేర్పించారు. అప్పుడు కామ క్రోధాది గుణాలు కూడా మనలను ఏమీ చేయలేవు. గోపికలు ఈ గుణాలన్నింటినీ భగవంతుడివైపు త్రిప్పుకున్నారు. వారు వారి మనస్సులను పరబ్రహ్మమునందే రమించమని - 'మానస సంచరరే బ్రహ్మణి' అని వేడుకున్నారు. అంతేకాని, వంటింట్లోను, బజార్లలోను తిరగమని కోరుకోలేదు. అందుకనే వారి కామం 'భక్తికామం' గా మారింది. వారి భక్తి అత్యంత పరాకాష్ఠకు చెందిన 'ఆత్మనివేదన' భక్తిగా మారింది.

కనుక వాసనా బీజాలన్నిటినీ ధ్యానాగ్నిలో కాల్చివేసిన నాడు ఇక పునరావృత్తి అనేది వుండదు. అటువంటి సాధన చేయడానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధనాసంపత్తిని ప్రసాదించి, గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!



# శ్రీ బాబు బృందావన ధామము - శ్రీ స్వామి నారాయణ్ అక్షర ధామము



(గత సంచిక తరువాయి)

ఒకానొక సందర్భంలో, శ్రీబాబు వేద శాస్త్ర పాండిత్యానికి, ఆత్మానుభవానికి గల తారతమ్యాన్ని విశదీకరించారు. దానిని ఆసాంతము విన్న సాంగ త్రివేదాచార్యులైన పండితుడు ఆనంద భాష్పాలతో,"బాబూ! అరవై సంవత్సరాల సుదీర్ఘ కాలం వేదాధ్యయనం చేసి అందుకోలేకపోయిన ఉపనిషద్రహస్యాన్ని, నేను పొందలేకపోయిన ఆత్మానుభవాన్ని తమరు అరవై నిముషాలలో అరటిపండు ఒలిచి ఇచ్చినట్లు అందించారు ధన్యుణ్ణి" అన్నారు.



శ్రీబాబు సాధనకాలంలో జరిగిన విశేషాలను ముచ్చటిస్తూ ఉండేవారు. అలా ఒకసారి యెడారిలో మండుటెండలో స్వామి ప్రయాణిస్తుండగా వారికి తీవ్ర దాహం వేసింది. అప్పుడు ఒక ఆగంతుకుడు మంచితీర్థం ఇచ్చి సేద తీర్చాడు. మరొకసారి ఒక మహారణ్యంలో ప్రయాణిస్తూ సొమ్మసిల్లి పోయినప్పుడు, బోయ దంపతులు వచ్చి తమ కుటీరానికి తీసుకొనివెళ్ళి ఉపచారాలు చేశారు. సంతానహీనులైన ఆ దంపతులు శ్రీబాబుని కుమారుని వలె చూసుకొన్నారు. శ్రీబాబు ప్రయాణమై వెడుతుంటే,"పసివాడవు నీకెవరూ లేరా? మాతో ఉండిపో. మాకు బిడ్డలు లేని లోటు తీర్చినవాడవు అవుతావు" అని బ్రతిమాలారు. "నాకు ఎవ్వరూ లేకపోవటమేమిటమ్మా? ఈ అరణ్యంలో తల్లి తండ్రులలాగా నన్ను ఆదుకోలేదూ. అలాగే మనం ఎక్కడికి వెళ్ళినా, ఏం చేస్తున్నా కాపాడే మన తండ్రి ఒకడున్నాడు. ఆయనను చేరుకోగలిగితే జీవితం ఇక ఆనందమయమే. ఆ తండ్రి దగ్గరికే బయల్దేరాను. మీరూ ఆ తండ్రిని చేరుకోగలరు" అని వారికి తరించే మార్గాన్ని బోధించి ముందుకు సాగారు.

శ్రీబాబు కొన్ని దినాలు ఒక కొండగుహలో ఉండి తపస్సు చేసుకొనేవారు. ఒక మహా సర్పం దివ్యకాంతులతో, దివ్య పరిమళాలు

వెదజల్లుతూ ఆ గుహలోకి వచ్చేది. "శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామియే తనకు దర్శనమిచ్చినట్టు అనుభూతిని పొందేవాడిని"అని చెప్పారు.

శ్రీబాబు ఎన్నో సార్లు ఒంటరిగాను, భక్తులతోను శ్రీశైల యాత్ర చేశారు. ఆ రోజుల్లో కొండపైకి బస్సులు లేవు. కాలినడకనే వెళ్ళాల్సివచ్చేది. అరణ్య మార్గమవటం వలన క్రూరమృగాల బెడద ఎక్కువగా ఉండేది. వారు పాదచారులై ప్రయాణం చేస్తూ ఉంటే యాత్రికులతో పరిచయం ఏర్పడేది. ఎంతో ఆత్మీయతతో వారి కష్ట సుఖాలను, యీతిబాధలని అడిగి తెలుసుకొని వాటికి నివారణోపాయాలు చెప్పేవారు. అవకాశం వచ్చినప్పుడల్లా వారితో తత్త్వ విచారణ చేసేవారు. "ఎవరివద్దైనా ఒక గ్లాసెడు మంచి తీర్థం తీసుకున్నా వాళ్ళకు జీవితాంతం ఉపయోగపడే ఉపకారాలు అమ్మ నా చేత చేయించుకునేది." అని స్వామి అనేవారు.

భద్రాచలం పాపికొండలలో ఎంతో కాలం శ్రీబాబు తపస్సు చేశారు. ఆ ప్రాంతంలో మహాత్ములొకరు శబరి ఆశ్రమంలో శిష్యులతో ఉండేవారు. ఆయన శ్రీబాబులోని తీవ్ర తత్త్వ పిపాసను. ధ్యానంలో అనన్యమైన ఏకాగ్రతను గుర్తించి ఎంతో ఆత్మీయభావంతో ఆదరించేవారు. శ్రీబాబు ఒకసారి తపస్సిద్ధిలో పరిణతిని పొందలేక పోయామనే ఆవేదనతో ఎత్తైన కొండ శిఖరంనుండి దూకారు. కరుణామయి అయిన జగన్మాత ఆయనను రక్షించిందా అన్నట్లు గుబురుగా ఉన్న చెట్టు కొమ్మల మధ్యలో పడి బాబు నిరపాయంగా వుండిపోయారు. అంతలో ఆ మహాత్ముడు త్వరపడుతూ వచ్చి, శ్రీబాబును దగ్గరగా తీసుకుని, "నాయనా! నీవు కారణ జన్ముడవు. నీ వలన ఎంతో లోకోద్ధరణ జరుగవలసి ఉంది. నీ తపస్సు ఫలించలేదని భావించావు. కాని ఇంత చిన్న వయస్సులో నీవు పొందిన పరిణితి మాహాయోగులకు మాత్రమే సాధ్యం. అనతి కాలంలో నీవు ఆత్మజ్ఞాన పరిపూర్ణుడవు అవుతావు" అని, "ఈ ఆపదలో నిన్ను జగన్మాత రక్షించిన తీరు చూస్తేనే జగజ్జనని నీ ద్వారా ఎంత లోకకళ్యాణం కలిగించ సంకల్పించిందో, విశదమవుతున్నది" ఆశీర్వదించారు.

భక్తుల ఇళ్ళలో ఉంటూ ఏ అర్థరాత్రి వేళలోనో ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయి, కొన్నాళ్ళకు తిరిగివచ్చి పాపికొండలలో గడిపి వచ్చానని చెప్పేవారు.

-సశేషం

# రాధా తత్త్వము

- రమణ ప్రసాద్

. శ్రీరాధాదేవి జననం గురించి ఈ విధంగా పద్మ పురాణంలో చెప్పబడింది- వృషభాన్ రాజు ఉత్తమ భక్తుడు. రాధాదేవి అతనికి స్వప్నంలో దర్శనం ఇచ్చి, "నేను భూలోకంలో అవతరించబోతున్నాను" అని చెప్పింది. వృషభాన్‌పూర్‌కు(బర్‌సానా) దగ్గరలో ఉన్న "రావలి"లో రాధ దివినుండి భూమికి దిగింది. వృషభానుడు తన భార్యతోఅక్కడికి చేరుకున్నాడు.ఆమెను బరసానాకు తీసుకువచ్చి పెంచుకోసాగాడు. భాద్రపద శుద్ధ అష్టమినాడు "రాధా పరమేశ్వరి"గా ఆమె అవతరించింది. అప్పుడు మోడు పడిన చెట్లు చిగురించాయి. రాళ్ళు సంగీతాలు వినిపించాయి. మూగవాడు మాట్లాడాడు. కుంటివాడు కొండలు ఎక్కగలిగాడు. ఆమె రాకతో ప్రకృతి అంతా పులకించిపోయింది.



నారదులవారు అక్కడికి వచ్చి ఆమెకు సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆయన భావ సమాధిని పొంది ఆమెను ఇలా కీర్తించాడు. " ఓ పరమేశ్వరీ! నీవు సచ్చిదానంద స్వరూపిణివి. సంధిని శక్తిగా కృష్ణునిలో కొలువై ఉండి ఆయనను అలరిస్తున్నావు. ఓ రాస స్వరూపిణీ! నువ్వు యోగ శక్తివి. మాయా శక్తివి. రసరూపిణివి. నువ్వు ఇచ్ఛా శక్తివి, జ్ఞానశక్తివి, క్రియాశక్తివి. నీ ముఖారవిందంనుండి దివ్య కాంతులు వెల్లి విరుస్తున్నాయి. నీ శక్తిని బ్రహ్మ రుద్రాదులు కూడా వర్ణింపజాలరు." అప్పుడు రాధ దివ్య కాంతులతో నారదునికి దర్శనం ఇచ్చింది.

బ్రహ్మ వైవర్త మహాపురాణంలో, బ్రహ్మ "ఓ దేవీ! నువ్వు కృష్ణుని నుండి ఉద్భవించావు. నువ్వూ, కృష్ణుడూ ఏక స్వరూపులే. మీ ఇరువురినీ ఎవ్వరూ విడదీయలేరు. గణేశుడు, "కృష్ణుని కొలిచేవారు ముందు నీ పేరు తలుస్తారు. అలా చేసినవారు పండితులుగా. యోగులుగా రాణించి గోలోకానికి చేరతారు" అని కీర్తించాడు. కృష్ణుడు ఈ విధంగా చెబుతున్నాడు - "నేను కృష్ణుడిని. నీతో కలిసి నేను శ్రీకృష్ణుడిని. నువ్వు లక్ష్మీ స్వరూపిణివి. నువ్వు విశ్వానికి ఆధారానివి. నీ వలననే విశ్వం నడుస్తోంది. నువ్వు పరాశక్తివి."

ఆ విధంగా రాధ భూలోకానికి దిగి గోలోకానికి వచ్చింది. అక్కడ కృష్ణుడు స్వర్ణ సింహాసనంపైన విరాజమానమై ఉన్నాడు. ఆయన సంకల్పం చేత రెండుగా విభజింపబడ్డాడు - కుడివైపున కృష్ణుడిగా, ఎడమవైపున

రాధికగా మారాడు. రాధికనుండి సమస్త దేవతలు ఉద్భవించారు. అసంఖ్యాకమైన గోపికలు ఉద్భవించారు. ఆమె ఎడమవైపు లక్ష్మి వెలసింది. శ్రీ రాధ, కృష్ణుని వక్షస్థలంపైన ఉంటుంది. కృష్ణుని ఊపిరి రాధ. రాధ జన్మించిన రోజు "రాధాష్టమి"గా పండుగ జరుపుకుంటారు. విశేషంగా గౌడీయ మతంవారు ఆరోజున ఉపవాసం చేసి ఉత్సవం జరుపుకుంటారు.

రాధ అర్హత ఏమిటి? అంటే ఆమె ఉత్తమ శ్రేణి కృష్ణ భక్తురాలు. అందువలన కృష్ణునికి ఆమెపైన అమితమైన ప్రేమ. కృష్ణుని కృపను కోరే భక్తులు ముందుగా రాధను ప్రార్థిస్తారు. ఆమె కృపను పొందినవారు కృష్ణుని అవ్యాజ ప్రేమకు వారసులవుతారు. ముందుగా కృష్ణుని ప్రార్థించినవారిని ఆయన రాధారాణిని శరణు కోరమంటాడు. అప్పుడు వారికి పరిపూర్ణమైన భక్తి లభిస్తుంది. రాధా కృష్ణుల దివ్య బంధం సనాతనమైనది. శాశ్వతమైనది. గౌడీయ మత వైష్ణవులు వారిని ప్రసన్నత చేసుకోవటానికి కృష్ణుడిని పరమాత్ముడిగా, రాధని పరాశక్తిగా ఆరాధిస్తారు. రాధను హ్లాదిని, సంధిని, సంవిత్ శక్తులు గల దేవతగా , ఆది లక్ష్మి అవతారంగా కొలుస్తారు.

కృష్ణుడు విశ్వాన్ని మురిపిస్తాడు. రాధ కృష్ణుణ్ణి మురిపిస్తుంది. రాధను 'రాధిక', 'రాధారాణి ' 'రాధే' అనే నామాలతో పిలుస్తారు. ఆమెను బృందావనంలో కృష్ణునితో రాసలీల జరిపే గోపికల నాయకురాలిగా, కళంక రహిత ప్రేమమూర్తిగా పూజిస్తారు. తనను కొలిచిన వారికి స్వార్థ రహితమైన ప్రేమను ప్రసాదిస్తుంది. ఆమె కృష్ణుణ్ణి పొందటానికి పడే ఆరాటం, జీవాత్మ పరమాత్మకొరకు పొందే ఆరాటం. కృష్ణుడు అష్ట పత్నులను, పదహారు వేల గోపికలను తన భార్యలుగా వారికి రక్షణ చేయటం కోసం స్వీకరించాడు. కాని రాధే అతని ప్రాణం.

"ఆమె దివ్య ప్రేమలో నేను ఆమెతో నాట్యం చేస్తాను. ఆమె పరాశక్తి, ప్రేమ స్వరూపిణి.ఆమెను ఆశ్రయించి 'రాధాకృష్ణ' అనే యుగళ మంత్రంతో ధ్యానించండి. బంగారు కాంతులు చిందించే ఆమె సృష్టికి కర్త, భర్త, ధర్త, ఆమె విద్యా స్వరూపిణి. ఆమె 'ప్రధాన' (ప్రకృతి), చిన్మయ రూపిణి, యోగ శక్తి, యోగ మాయ. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఉనికికి కారణభూతురాలు. ఆమెను నేను దివ్యానందాతిరేకంతో పరిష్వంగం చేసుకుంటాను. నేను 'భువనేశ్వరుడను'. రాధ 'భువనేశ్వరి' అంటాడు కృష్ణుడు. ( పద్మ పురాణం).

**రాధాశక్తి బినా న కోయీ శ్యామల్ దరశన్ పావే।**

**ఆరాధన కర్ రాధే రాధే కాన్హా భాగే ఆవే॥**

"రాధను ఆరాధించకపోతే శ్యామ సుందరుని దర్శనం దుర్లభం. రాధను ఆరాధిస్తే శ్యామ సుందరుడు పరుగు పరుగున వచ్చి దర్శనం ఇస్తాడు"

# దేవుడు ఉన్నాడా?

- మురళి

అదొక చిన్న పల్లెటూరు. రామయ్య, సీతమ్మ దంపతులకు ఏకైక కుమార్తె పద్మిని. వయస్సు 6 సంవత్సరాలు. పద్మినికి గుండెల్లో నొప్పిగా వుంటోందని పట్నంలో వున్న డాక్టర్లకు చూపించారు. చూసిన డాక్టర్లంతా మందులతో తగ్గిపోతుందని మందులు వ్రాసి యిచ్చారు. ఎంతమంది డాక్టర్లకు చూపించినా రోగం మాత్రం తగ్గలేదు. చివరకు ఒక డాక్టరు "రోగం ముదిరింది, తగ్గే అవకాశాలు లేవు, ఎందుకైనా మంచిది పెద్ద పట్నంలోని ప్రత్యేక నిపుణులకు  చూపించడం మంచిద"ని చెప్పి, ఆ పెద్ద డాక్టరు అడ్రసు యిచ్చి పంపారు.

ఆ పెద్ద డాక్టరుగారు బాగా ప్రసిద్ధి చెందినవారు. వారికి వేరు వేరు పట్టణాలలో చాల హాస్పిటల్స్ కూడా వున్నాయి. మామూలుగా రోగులతో ఆయన మాట్లాడరు. వారి సహాయ వైద్యులు చూసి, వారు యిచ్చిన నివేదిక ఆధారంగా వైద్యం చేస్తారు. తప్పని పరిస్థితులలో మాత్రమే రోగిని స్వయంగా చూస్తారు. దైవకృప వల్ల ఆ డాక్టరు గారు ఆ పాపను స్వయంగా చూశారు. చూస్తూనే ఎందుకింత ఆలస్యం చేశారని కోప్పడ్డారు. రామయ్య, సీతమ్మలు 'అయ్యా! మేము పల్లెటూరువాళ్ళము. మాకు వైద్యం గురించి ఏమి తెలుస్తుంది? డాక్టరుగారు ఏది చెబితే అది చెయ్యటం తప్ప' అన్నారు. ఆ పెద్ద డాక్టరుగారు ఆ పాపకు రెండు రక్తనాళాలు పూడుకు పోయాయి. ఆపరేషను తప్పని సరి, అయినా కూడా బ్రతుకుతుందని నమ్మకం లేదు. ఆపరేషను చేసినా 30% మాత్రమే అవకాశం వున్నది అని వివరంగా చెప్పారు.

వైద్య పరీక్షలు అన్నీ నిర్వహించిన తరువాత గుండె ఆపరేషను (Open Heart Surgery) తప్పనిసరి అని చెప్పారు. ఆ పాప తల్లిదండ్రులు ఫరవాలేదు చెయ్యండి. ఆ దేవుడు మమ్ములను తప్పక రక్షిస్తాడు' అని వారు ధీమా వ్యక్తం చేశారు. ఆ పాప డాక్టరుగారితో 'నాకు గుండె ఆపరేషను చేస్తారుట కదా! గుండెను పూర్తిగా తెరచి ఆపరేషను చేస్తారుట కదా! మా అమ్మ నాకు రోజూ స్నానం చేయించి, కుంకుమ బొట్టు పెడుతూ దేవుడు నీ గుండెల్లో వున్నాడమ్మా, రక్షిస్తాడని చెబుతుంది. ఆపరేషనప్పుడు నా గుండెల్లో దేవుడు ఎలా వున్నాడో చూసి నాకు చెప్పరా?' అని అడిగింది. దానికి ఆ డాక్టరుగారు మాట మారుస్తూ, నీకేమీ నొప్పి వుండదమ్మా, నొప్పి లేకుండా ఆపరేషను చేస్తాను కదా! అంటే, ఆ పాప 'అదికాదు డాక్టరుగారూ! నేనడిగేది. మీరు ఆపరేషను చేసినప్పుడు నా గుండెల్లో దేవుడు ఎలా వున్నాడో చూసి చెప్పమని అడుగుతున్నాను' అన్నది. ఆ డాక్టరుగారికి దేవుడంటే నమ్మకం లేకపోయినా, ఆ పాపకి దేవుడి మీద వున్న నమ్మకానికి, ఆ విషయం తెలియజేసిన ఆ తల్లిదండ్రుల విశ్వాసానికి ముగ్ధులయ్యారు. ఎందరో దేవుడున్నాడని అనుదినం

అంటూనే వుంటారు. అనటం వేరు, అంతటి ప్రగాఢ విశ్వాసం కలిగి వుండటం వేరు కదా!

పాప ఆపరేషను టేబుల్ మీద వుంది. ఆపరేషను మొదలయింది. ఏడుగురు ప్రత్యేక నిపుణులైన డాక్టర్లు ఆపరేషను నిర్వహిస్తున్నారు. 45 నిమిషాలు గడిచింది. వెంటిలేటరు నడుస్తూనే వుంది. నాడి కొట్టుకోవటం క్రమంగా తగ్గిపోతోంది. గుండెలో నుంచి కొంచెం కూడా రక్తం రావటం లేదు. నాడి తగ్గి తగ్గి పూర్తిగా ఆగిపోయింది. ఎన్నో వందల ఆపరేషనులు చేసినా, ఏనాడూ ఏ భావనకూ లోనుగాని, ఆ డాక్టరుగారు పూర్తిగా నిస్పృహకు లోనై, కళ్ళ నిండా నీళ్ళు నింపుకుని, ఆపరేషను టేబుల్ దగ్గర నుండి దూరంగా వెళ్ళిపోయి, గద్గద స్వరంతో, 'అయిపోయింది! ఆ పాపను రక్షించ లేకపోయాము. మిషన్లు తీసివేసి, ఆ శరీరాన్ని వాళ్ళవాళ్ళకి యిచ్చెయ్యండి. భగవంతుడా! నువ్వు వున్నావన్న నమ్మకం నాకు లేకపోయినా, ఆ పాప, తల్లిదండ్రులు నిన్నెంతగానో విశ్వసించారు కదా?' అంటూ కన్నీళ్ళు తుడుచుకుంటున్నారు. అంతలో ఆ ప్రక్కనే వున్న డాక్టరు 'డాక్టరుగారూ! రక్తం వస్తోంది' అని అరచినట్లుగా అన్నారు. వెంటనే అందరూ అప్రమత్తులై తిరిగి ఆపరేషను టేబుల్ దగ్గరకు చేరుకున్నారు.

'బలమైన దైవ సంకల్పంతోనే ఇలా జరిగింది' అని డాక్టరుగారు నమ్మి ఆపరేషను మొదలు పెట్టారు. సుమారు నాలుగున్నర గంటలసేపు శ్రమించి ఆపరేషను పూర్తిచేశారు. పాపకు స్పృహ వచ్చింది, చూసి వస్తారా? అని అడిగిన వారితో 'పాప నన్ను చూసిన వెంటనే అడుగుతుంది దేవుడిని చూశారా? దేవుడు ఎలా వున్నాడు? అని. ఏమని చెప్పను?' అనుకుంటూ నెమ్మదిగా ఆ పాప దగ్గరకు నడిచాడు. ఆ పాప అడగనే అడిగింది. డాక్టరు గారు ఆ పాపతో ' పాపా! దేవుడిని చూడటానికి ప్రయత్నించ కూడదు. దేవుడు వున్నాడనే అనుభూతి మనకు ప్రతి క్షణం తెలుస్తూనే వుంది కదా! దేవుడున్నాడనే నమ్మకాన్ని ప్రగాఢంగా కలిగి వుంటే, దైవత్వాన్ని నిత్యమూ అనుభవించ గలుగుతాము' అన్నారు.

ఆ రోజు నుండి డాక్టరుగారి గదిలోనూ, ఆపరేషన్ థియేటర్‌లోనూ, దేవుడి ఫొటోలు పెట్టబడ్డాయి. గతంలో ఆ డాక్టరుగారు ఎంతటి పెద్ద ఆపరేషను అయినా సరే అవలీలగా నేను చేసేయగలను, రోగాన్ని నయం చేయగలననే అహంకారంతో వుండేవారు. ఇప్పుడు దేవుడి ఫొటో ముందు నిలబడి, 'భగవంతుడా! నా అనుభవాన్ని, జ్ఞానాన్ని పూర్తిగా ఉపయోగించి ఆపరేషను చేస్తాను. కానీ రక్షించేవాడివి మాత్రం నీవే సుమా!' అంటున్నారు. భగవంతుడి యందు మనస్సు పూర్తిగా నిలిపి ప్రగాఢమైన విశ్వాసం కలిగి వుండాలి. మనం చేసే ప్రతి క్రియలోనూ అది వ్యక్తం కావాలి.

(ఇది కథ కాదు. బరోడాలో జరిగిన యదార్థ సంఘటన)

# చింతయ్య

- రమణ ప్రసాద్

## అవిద్యానిరూపణము

దైనందిన జీవితంలో కలిగే అనుభవాలతో అవిద్య (అజ్ఞానం) ఏ విధంగా మనలను సత్యానికి దూరంగా చేస్తుందో తెలుసుకుందాం. 'మాయ' యొక్క తమోగుణం ' ఆవరణ శక్తి. అది వస్తువు యొక్క యదార్ధ రూపాన్ని మరుగు పరచి దానిని మరియొక రూపంగా తోచేటట్లుగా చేస్తుంది. ఎంత బుద్ధిశాలికైనా భ్రాంతితో ఆరోపింపబడిన వస్తువే సత్యమనే ఆభాస కలిగిస్తుంది. దేహమే ఆత్మ అనే భావనను కలిగిస్తుంది. దేహమే నేను అనే భావన బంధ హేతువు అవుతుంది. అనగా ఒక వస్తువును చూచి ఇంకొక వస్తువనుకోవటం - త్రాడును చూసి ప్రామనుకోవటం; ఎండమావులను చూసి జలాశయ మనుకోవటం; దుంగను చీకటిలో చూసి మనిషిగా భావించటం మొదలగునవి ఉదాహరణలు.



చారలచొక్కా, గళ్ళలుంగీ ధరించిన ఒక వ్యక్తి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నమస్కారం పెట్టుకుంటున్నాడు. అప్పుడే శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చనాదులు పూర్తి అయ్యాయి. నివేదన చేసిన కొబ్బరిచెక్కలు విజ్ఞానమందిరానికి తీసుకు వెళ్ళాలి. అక్కడ ఎవరో, "చింతయ్య" తీసుకువెళ్తాడు" అనటం జరిగింది. నేను ఈ వ్యక్తిని "చింతయ్య" అనుకొన్నాను.. ఆ తరువాత ఏదో సందర్భంలో ఈ ప్రసక్తి వస్తే, "అతడు చింతయ్య కాదండీ. అతని పేరు "ఫలానా" అని చెప్పారు.

ఇంతకీ అతని పేరు ఏమిటోగాని, అతనిని చూస్తే అతడు చింతయ్య అనే భావం పోలేదు. కాని అతడు చింతయ్య కాదని తెలుసు.

దేహమే ఆత్మ అనే భావన బంధ కారణమని చెప్పుకొన్నాము కదా! ముముక్షువైనవాడు బంధవిముక్తి పొందటానికి ఆత్మానాత్మ విచారణ చేయాలి. ఆత్మానాత్మ వివేకం వల్లే సాధకుడు తనయొక్క సచ్చిదానంద స్వరూపమును తెలుసుకొని పరమానందం పొందుతాడు.

# మృష్టాన్న భోజనం

- అఖిల

తపస్సుకై తమ్ముడు శివకామయ్య వెంటరాగా 1902 లో శ్రీ కావ్యకంఠ గణపతిముని అరుణాచలం చేరాడు. తమ్ముడు ఆకలికి ఆగలేక పోతున్నాడు. సాయంత్రం 6గం.లు అయింది.

గణపతిముని అన్నసత్రానికి దారితీశాడు. ఆరోజు ఏకాదశి కావటం వల్ల సత్రం మూసివేశారు. తమ్ముడు ఆకలితో గిలగిలలాడి పోతున్నాడు. సోదరుడికి అర్ధణా పెట్టి అరటిపళ్ళు కొనియిచ్చాడు. అయినా అతని ఆకలి తగ్గలేదు. బ్రాహ్మణ వీధికి వెళ్ళి గణపతిముని భిక్షనడిగాడు. లేదని జవాబిచ్చారు. పోనీ చల్ది అన్నమైనా వుంటే పెట్టమని అర్థించాడు. అందుకు కూడా ఆ గృహస్థులు శూన్యహస్తాలే చూపించారు. తమ్ముడు అల్లాడిపోతున్నాడు.

'అరుణాచలంలో అన్నానికే కొదవా! ఇంత బ్రాహ్మణీకంలో ఒక్కరూ పసివానికి ఇంత అన్నం పెట్టలేరా?' అనుకుంటూ వీధివీధి తిరుగుతున్నాడు. రాత్రి 9గం.లు దాటుతోంది.

గణపతిముని తన వేదనను తెలియజేసే ఒక సంస్కృత శ్లోకాన్ని చదువుతూ అయ్యంకుళ వీధిగుండా వెడుతున్నాడు.

'నాయనా! ఎవరు మీరు? ఏమిటా శ్లోకానికి అర్థం?' అని అడుగుతూ ఒక స్వరం పలుకరించింది. గణపతిముని ఆగి చూశాడు. ఒక పండు ముదుసలి లేచి కూర్చున్నాడు. గణపతిముని తన దురవస్థ తెలుపుకున్నాడు.

ఆ ముదసలి పొంగిపోతూ 'నాయనా! ఇవ్వాళ మా ఇల్లాలు ఒక వ్రతం చేసింది. ఇద్దరు బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. అప్పుడు కాని వ్రతం పూర్తి కాదు. ఆ ఇద్దరు బ్రాహ్మణులకై తిరిగి తిరిగి వేసారి పోయాను. ఏకాదశి అని ఎవ్వరూ రాలేదు. మా అదృష్టం కొద్దీ మీరు దొరికారు. మడి కట్టుకోండి. పదండి నాయనా' అన్నాడు.

గణపతిముని ఏకాదశి మూలాన భోజనం చేయడు. కాని తాను తినకపోతే తన తమ్ముడికి కూడా భోజనం దొరకదనే భయంతో 'సరే'నని భోజనానికి కూర్చున్నాడు.

పసిమిరంగు ఛాయ, విశాల నేత్రాలు గల ఆ ఇల్లాలు భోజనం వడ్డించి, వద్దన్నా వినకుండా బలవంతంగా అనేక పదార్థాలను తినిపించింది. గణపతిముని సహజంగా మితాహారి. అయినా ఆ రోజు ఆమె వదనం చూస్తుంటే మాతృప్రేమ పొంగుకు వచ్చింది. అన్నరసం కంటె ఆదర రసం ఎక్కువంటారు ఇదే కాబోలు అనుకున్నాడు.

ఆ దంపతులనిద్దరినీ చూస్తుంటే గణపతిమునిలో అకారణంగా భక్తి పొంగుకు వచ్చింది. సజల నయనాలతో వారిద్దరికీ నమస్కరించాడు. ఆ తల్లి ఆ సోదరులిద్దరికీ తాంబూలం, దక్షిణ ఇచ్చింది. భుక్తాయాసంతో ఆ సోదరులిద్దరూ ఆ అరుగుమీదనే నడుం వాల్చారు.

భళ్ళున తెల్లవారింది. సాధారణంగా గణపతిముని తెల్లవారు జామునే లేచి కాలకృత్యాలు తీర్చుకుని తపస్సులో కూర్చుంటాడు. కాని ఆ నాడు సూర్యోదయానికి కాని మెలకువ రాలేదు.

చిత్రం! కలా! నిజమా! రాత్రి వున్న ఆ గృహానికి బదులు గణపతి దేవాలయం అరుగు మీద తామిద్దరూ వున్నారు. సోదరులిద్దరూ విభ్రాంతులయ్యారు! కొంతసేపటికి తెప్పరిల్లారు. చూట్టూ చూశారు. దేవాలయం లోనుండి ఘంటానాదాలు వినబడుతున్నాయి. రాత్రి విందు సత్యమే అని ప్రక్కనే వున్న దక్షిణ తాంబూలాలు సాక్ష్యం పలుకుతున్నాయి.

గణపతిముని ఆ రోజు అంతా తాము భుజించిన ఆ గృహం కోసం వెతికారు. ఎక్కడా ఆ ఆచూకీయే లేదు.

శ్రీ అరుణాచలేశ్వరుడు, శ్రీ ఆపీతకుచాంబ కరుణాపూర్ణులై తమకు స్వయంగా భిక్షను అనుగ్రహించారని గ్రహించిన ఆ సోదరులు ఆనందబాష్పాలలో తడిసిపోయారు!!

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**జనవరి 2019**

01 మంగళవారం - ఆంగ్ల సంవత్సరాది, సాయంత్రం 5గం॥ల30నిలకు. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

14 సోమ -భోగి - సాయంత్రం 5గం ॥30నిలకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, శ్రీబాబుకు భోగిపళ్ళు పోయటం, భక్తసమారాధన.

15 మంగళ - మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, సాయంత్రం 5గం॥ల30నిలకు,సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

21 సోమ - పూర్ణిమ - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము, భక్తసమారాధన.

26 నుండి 30 వరకు వార్షిక సత్సంగ సమావేశములు.

30 బుధ - శ్రీగురుదశమి. శ్రీసద్గురు పాదపూజ.

**ఫిబ్రవరి 2019**

10 ఆదివారం - మాఘ శుద్ధ పంచమి - శ్రీ సద్గురు క్షీర శిలామూర్తుల ప్రతిష్ఠా చతుర్థ వార్షిక మహోత్సవము - ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

12 మంగళవారం - రథసప్తమి - సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

16 శనివారం - భీష్మఏకాదశి సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

19 మంగళవారం - మాఘ(గురు) పూర్ణిమ, సాయంత్రం 5గం॥30నిలకు సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

28 గురువారం - శ్రీగురుదశమి -సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

# దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి

(గత సంచిక తరువాయి) – సుషుమ్నా ప్రసాద

పూజ్య శ్రీ మాతాజీ (అమ్మ) ప్రవచనాలలో మీ ఇల్లు బంగారం చేసుకోమని హెచ్చరిస్తున్నారు. ఇల్లు బంగారం చేసుకోవటమనేది వాచార్థంలో తీసుకో కూడదు. ఇల్లు బంగారం చేసుకోవటమంటే బంగారు బిస్కెట్లను ఇటుకలుగా పేర్చి గోడలు నిర్మించి, బంగారంతో వెల్లవేసి, ఇంటి నిండా బంగారు సామాగ్రితో నింపుకోవటం కాదు. అలా చేస్తే యిల్లు దుఃఖాలయమవుతుందేగాని, ఆనందనిలయంగా, ఆధ్యాత్మిక మందిరంగా మారదు. మనము 'అమ్మ' ప్రబోధంలోని అంతరార్థమును గ్రహించాలి. దేహమనేదే ఇల్లు. అన్ని లోహాల్లోకి బంగారం చాలా విలువైనది అందుచేత బంగారం అత్యంత విలువగల దానికి అమూల్యమైనదానికి సంకేతంగా పరిగణిస్తాము. అందుచేత ఇల్లు బంగారం చేసుకోవటమంటే, ఈ దేహమనే గేహమును పవిత్ర దేవాలయంగా మలచుకోవాలి. బాహ్య విషయాదులయందు (మాలిన్యము) లగ్నమైన మనస్సుని ఏకాగ్ర దృష్టితో అంతర్ముఖం చేసుకుని, లక్ష్యార్థ సాధన చేసి, జీవిత జ్యోతిని ప్రజ్వలింపజేయాలి. అలా మోక్షఫల సాధనలో సఫలీకృతం చేసుకున్నప్పుడే ఇల్లు బంగారం అవుతుంది. అలా ఏకాగ్రమైన లక్ష్యార్థ సాధన చేయడం వలన ఇల్లు బంగారం అవుతుంది కాబట్టి, మీ ఇల్లు బంగారం చేసుకోమని పూజ్యశ్రీ మాతాజీ అశీర్వదిస్తూ, హెచ్చరిక చేస్తున్నారు.

అలా కాకుండా కాంచనాన్ని పెంపొందించుకోవటమే జీవిత పరమార్థమనుకొంటే, మానవజీవితం జ్యోతి రహితమై, అంధకార బంధురమవుతుంది. ఈ సత్యాన్ని నిరూపించే ఒక కథ వున్నది. పాశ్చాత్య దేశాన్ని సమర్థవంతంగా పరిపాలించే 'మిడాస్' అనే మహారాజు వుండేవాడు. ఆ రాజు బంగారం మీద వ్యామోహంతో తన ఇష్టదైవాన్ని స్మరిస్తూ తపస్సు చేశాడు. ఆ మహారాజు చేసిన కఠోర తపస్సుకు భగవంతుడు ప్రసన్నుడై, ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. వెంటనే మహారాజు కాంచన వ్యామోహంతో తాను స్పృశించేదేదైనా బంగారంగా మారాలన్నాడు. భగవంతుడు చిరునవ్వుతో తన

తపస్సునంతా వృథా చేసుకున్నాడు కదా అనుకొని, కోరిన వరాన్ని ప్రసాదించాడు. మిడాస్ మహారాజు ఆకలి దప్పులను, నిగ్రహించి, చిరకాలం తపస్సు చేశాడేమో, బాహ్యా దృష్టికి వచ్చేసరికి విపరీతమైన ఆకలి వేసింది. మహారాజు కదా! షడ్రసోపేతమైన ఆహారాన్ని తయారు చేయించుకుని, విపరీతమైన ఆకలితో అలమటిస్తూ, వేగంగా తినాలని ఆహారమును చేతితో పట్టుకున్నాడు అది వెంటనే బంగారంగా మారింది. ఇక నిస్పృహతో దప్పిక తీర్చుకుందామని గ్లాసుతో నీరు తీసుకున్నాడు. ఆ నీరు కూడా అతని స్పర్శతో బంగారంగా మారింది. ఆకలి, దప్పికలతో భార్యతోనన్నా ఆనందాన్ని పంచుకుందామని శయన మందిరం చేరుకున్నాడు. ఆరాటంతో మహారాణిని స్పృశించాడు. వెంటనే ఆమె బంగారు బొమ్మగా మారింది. శయ్యపై నిద్రిద్దామని ప్రయత్నించాడు. వెంటనే అతని స్పర్శతో మృదువైన ఆ తల్పం కూడా కఠినమైన కాంచనంగా మారింది.

ఇక ఆ మహారాజుకు దిక్కుతోచలేదు. తాను పొందిన వరం శాపంగా మారిందని గ్రహించాడు. చేసిన తపస్సంతా బుగ్గిపాలయి నందుకు , తన మూర్ఖత్వమును తానే నిందించుకున్నాడు. వెంటనే ఘోరమైన తపస్సు చేసి, భగవంతుడు ప్రత్యక్షం కాగానే తనకిచ్చిన వరాన్ని వుపసంహరించుకోమని ప్రాధేయపడ్డాడు. వెంటనే భగవంతుడు 'తథాస్తు' అని దీవించాడు. కాంచన వ్యామోహం మానవుని పతనానికి పునాది రాయివంటిదని గ్రహించాడు. మిడాస్ మహారాజు చరిత్ర స్వర్ణ వ్యామోహం మన పతనానికి మచ్చుతునక వంటిది. కనుక విషయ వ్యామోహానికి వీడ్కోలు చెప్పి, విశ్వేశ్వర సాక్షాత్కారానికి సాధన చేస్తే, మన జీవితం జ్యోతిర్మయమై, స్వర్ణసౌధంగా మారుతుందని మన మాతాజీ ప్రబోధ సందేశం.

# అభయ హస్తం

- లాల్

ఇంద్రజాల విద్య ప్రదర్శించినంత మాత్రాన మహాత్ములు కారు. మహాత్ములు అట్టి విద్యలను ప్రదర్శించరు. మహత్తులనేవి సహజంగానే మహాత్ముల నుండి వెలువడుతుంటాయి. శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీప్రసాద బాబూజీ మహరాజ్ అట్టి మహనీయులు.

శ్రీ బాబూజీ ఆంతరంగిక భక్తులు, వారి మహత్తులను అనుభవ పూర్వకంగా గ్రహించినవారు ఎందరో వున్నారు. ఈ సందర్భంలో డాక్టరు కె. వెంకటరాజుగారి పట్ల శ్రీబాబూజీ అనుగ్రహించిన మహత్తును స్మరించడం మహాత్ముల యెడల సామాన్యులకు భక్తి భావం ఏర్పడేందుకు ఎంతగానో తోడ్పడుతుంది.

డా॥ కె. వెంకటరాజుగారు నిండ్రకొలను వాస్తవ్యులు. బాల్యంలోనే కృష్ణ సాక్షాత్కారాన్ని పొందిన భాగ్యశాలి. నిరంతరం వారి ఇంట్లో తత్త్వ విచారణ కొనసాగుతుండేది. బాబూజీ ఎడల వారు ఎంతో భక్తిప్రపత్తి గలవారు. శ్రీబాబూజీ వంటి మహనీయులు అవతరించిన కాలంలో తాను జన్మించి వుండటం జన్మచరితార్థంగా భావించేవారు. తానేకాక తన అనుయాయులెందరినో శ్రీ బాబూజీకి శిష్యులుగా చేసి వారందరికీ భక్తి మాధుర్యాన్ని చవిచూపారు.

ఒకసారి రాజుగారు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. వారి గ్రామంలో వైద్య సౌకర్యం లేక వారిని భీమవరం తీసుకుపోవలసి వచ్చింది. అక్కడి వైద్యశాస్త్ర పరాయణత్వం రాజుగారి ఎడల ఫలించలేదు. రాజుగారు స్పృహ కోల్పోయారు. డాక్టర్లు నిరాశానిస్పృహలకు లోనయ్యారు. 'భగవంతునికి తప్ప మరెవరికీ బ్రతికించటం సాధ్యం కాదు' అని తేల్చివేశారు.

ఆ స్థితిలో కూడా డాక్టరుగారు బాబూజీని దర్శించాలని కోర్కెను వెలిబుచ్చారు. మృత్యుసమయంలో సయితం రాజుగారి హృదయ మందిరంలో శ్రీబాబూజీ నిలచి వున్నారంటే, వారి భక్తి ఎంతటి అపురూపమో వూహించ వలసినదే.

అయితే రాజుగారి అభీష్టం నెరవేర లేదు. ఆ స్థితిలో కదిలించి తీసుకువెళ్లటం అసాధ్యం. పూర్తిగా స్పృహ కోల్పోయి వున్నారు. శరీరం మీద చీమలు నడయాడుతున్నాయి. భక్తుడు భగవంతుని సమీపించే

స్థితిలో లేడు. కాబట్టి భగవంతుడే భక్తుని దగ్గరకు రక్షణార్థం రావలసి వున్నది.

రాజుగారి స్థితిని శ్రీబాబూజీకి తెలియజేసి రావలసినదిగా ఒక వార్తాహరుని ఆయన వద్దకు పంపించారు. అతడు వెళ్ళే సమయానికి బాబూజీ దగ్గర చనిపోయిన వాడిని బ్రతికించే ప్రక్రియ గూర్చి చర్చ జరుగుతున్నది.

వార్తాహరునితో బాబూజీ 'నేను వస్తున్నాను. నేను వచ్చేవరకు రాజుగారి శరీరాన్ని అలాగే వుంచండి' అన్నారు. ఇక్కడ డాక్టర్లు రాజుగారు పోయిన వార్తని నిర్ధారించారు. ఇంతలో వెళ్ళిన వార్తాహరుడు అక్కడకు వాయువేగంతో చేరుకుని, బాబు రాకను గురించి తెలియజేశాడు.

అక్కడ వున్నవారంతా గురుదేవుని దర్శనార్థం కుతూహలంతో ఎదురు చూస్తున్నారు. ఇంతలో శ్రీబాబు అక్కడకు రావటం, రాజుగారి నోట్లో తీర్థం పోయటం, తక్కిన వారితో కూడా పోయించటం జరిగింది. మృతదేహానికి తీర్థం పోయటమేమిటని అన్న సంశయాత్ములు కూడా లేకపోలేదు.

తీర్థం ఇచ్చాక డాక్టర్లు బాబు ఆజ్ఞ ప్రకారం రోగికి ఇంజెక్షన్ ఇచ్చారు. క్షణాల మీద క్షణాలు గడుస్తున్నాయి. అందరూ ఇప్పుడు ఏం జరుగుతుందో అని ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఆశ్చర్యం! మూతపడి వున్న రోగి నేత్రాలు కొద్ది కొద్దిగా విచ్చుకుంటున్నాయి. జడంగా పడివున్న రోగి శరీరం చైతన్యంతో కదలాడింది. మృత్యుగహ్వరం నుండి పునరుజ్జీవనం జరిగింది. అక్కడ వున్న వారంతా అద్భుత రసంలో మునిగిపోయారు.

స్వస్థత పొందిన తరువాత డాక్టరుగారు సూక్ష్మశరీరంతో తాము పొందిన మృత్యు అనుభవాన్ని ఇలా చెప్పారు. "పెంజీకటిని చూశాను. పెద్ద పెద్ద కాంతిగోళాలు, చిన్న చిన్నవి ఒకదాని నుండి మరొకటి దూసుకు పోతున్నాయి. ఆ దృశ్యం భయంకరంగా వుంది. కొంతకాలం గడిచింది. ఆ గోళాలన్నీ ఎండిన చెట్టుకొమ్మలపై నిలిచి వున్నట్లు కనిపించింది. ఒక పెద్ద సుడిగాలి వీచింది. గోళాలన్నీ చెదురుమదురై పోయాయి. నేను అంధకారబంధురమైన కటిక చీకటిలో పడి పోయాను. భయకంపనతో విహ్వలుడనైపోయాను.

హఠాత్తుగా నా నోటివెంట 'బాబూజీ!' అన్న కేక వెలువడింది. అప్పుడు ఒక బలోపేతమైన హస్తం నన్ను ఆ గాఢ తమస్సు నుండి తేజోమయమైన ప్రదేశానికి తీసుకుపోయింది. నేను మేలుకున్నాను. మేలుకొన్నాను అనడం కంటే పునర్జన్మను పొందాను అనడం సబబుగా వుంటుంది.

ఇలా బాబూజీ అభయహస్తం నాకు ప్రాణదానం చేసింది. దృఢమైన విశ్వాసం గలవారినందరినీ బాబూజీ దివ్యహస్తం రక్షించగలదు. మీరు పరిపూర్ణంగా విశ్వసించండి. మీ విశ్వాసం ద్వారా తప్పక రక్షణ పొందగలరు!" అన్నారు రాజుగారు.



# మోక్షమునకు అందరూ అర్హులే

- గాలి జగదీశ్

ఒకసారి అర్జునుడు శ్రీకృష్ణునితో "కొన్ని కులములు అతి నీచమైనవిగాను, వానిలోని ధర్మములు అతి హేయములుగా వున్నవి కదా. మరి అట్టి కులాచారమును అనుసరించేవాడికి జ్ఞానోదయం అవుతుందా? అట్టివాడు మోక్షానికి అర్హుడేనా?" అని ప్రశ్నించాడు.

దానికి సమాధానముగా శ్రీకృష్ణుడు మాట్లాడుతూ "దానిలో ఎట్టి సందేహమూ లేదు. వారు ఎంత నీచకులములో జన్మించినా, ఏ వృత్తిని అవలంబించినా అందరూ మోక్షానికి అర్హులే!" అని చెప్పాడు.

దానికి ఉదాహరణగా మిథిలా నగరంలో ధర్మవ్యాధుడనే బోయవాడు ఒక బ్రాహ్మణుడికే జ్ఞానోపదేశం చేశాడు.

కౌశికుడనే బ్రాహ్మణుడు వేదాధ్యయనం చేసి, భిక్షమెత్తి జీవించేవాడు. ఒకరోజు ఆ కౌశికుడు భిక్ష కోసం ఒక ఇంటి ముందు నిలబడ్డాడు. ఆ ఇంటి ఇల్లాలు తన భర్త అప్పుడే ఊరి నుంచి వచ్చినందువల్ల అతని సేవ చేస్తూ వుండి పోయి, భిక్ష తీసుకురావటంలో కాస్త ఆలస్యం చేసింది. దానికి కౌశికుడు కోపించగా ఆ ఇల్లాలు, "మిథిలానగరంలో ధర్మవ్యాధుడనే భక్తుడు ఇంద్రియములు జయించినవాడు, సమస్త ధర్మములను ఎరిగినవాడు నివశిస్తున్నాడు. నీవు అతని దగ్గరకు వెళ్ళి ఉపదేశమును పొందు" అని చెప్పగా, ఆ కౌశికుడు మిథిలా నగరం పోయి చూడగా ధర్మవ్యాధుడు మాంసం అమ్మి వ్యాపారం చేస్తున్నాడు. అది చూసి ఇతడా! నాకు వుపదేశం చేసేది అని ఆశ్చర్యపోయాడు కౌశికుడు.

ధర్మవ్యాధుడు కౌశికుని చూస్తూనే ఫలానా గృహిణి పంపగా నా దగ్గరకు వచ్చారా? అని అడిగేసరికి ఆశ్చర్యపోయి 'నీకు ఎలా తెలిసింది?' అని ప్రశ్నించాడు కౌశికుడు. అప్పుడు ధర్మవ్యాధుడు ఆ బ్రాహ్మణుని తన ఇంటికి తీసుకుని పోయి, తన మాతాపితురలకు సేవ చేసినందువలననే తనకు ఈ దివ్యదృష్టి కలిగినది అని చెప్పి, ఆ కౌశికునకు ధర్మవ్యాధుడు జ్ఞానోపదేశం చేస్తాడు. ఏ కులమైనా, ఏ వృత్తి అయినా సరే మోక్షానికి అడ్డుకాదు అని శ్రీకృష్ణుడు తెలియజేసిన మాట యదార్థమే కదా!

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**జనవరి 2019**

01 మంగ - ఆంగ్ల సంవత్సరాది, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన

03 గురు- మాస శివరాత్రి, పావులూరు శాఖలో ఏకాహం

05 శని - అమావాస్య

14 సోమ - భోగి , శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపళ్ళుపోయుట.

15 మంగ - మకర సంక్రాంతి; శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన, ఉత్తరాయణ ప్రారంభం.

16 బుధ - కనుమ

21 సోమ - పూర్ణిమ , శ్రీ సద్గురు పాదపూజ,

25 శుక్ర - శ్రీత్యాగ రాజ స్వామి వారి ఆరాధన.(పుష్య బహుళ పంచమి)

30 బుధ - శ్రీగురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

**ఫిబ్రవరి 2019**

02 శని - మాస శివ రాత్రి, పావులూరు శాఖలో ఏకాహం.

04 సోమ- అమావాస్య.

12 మంగ - రథ సప్తమి

16 శని - భీష్మ ఏకాదశి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

19 మంగ -గురు మాఘపూర్ణిమ, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

28 గురు - శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ పరమ భక్తులు, పెదనిండ్రకొలను వాస్తవ్యులు అయిన పోతురాజు అంతర్వేది 3-12-2018 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 72 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 41వ శ్లో॥**

**బాలికా తాళికా తాళ లీలాం యా**
**సజ్జ సందర్శిత భ్రూలతా విభ్రమ**
**గోపికా గీత దత్తావధాన స్వయం సజ్జ**
**వేణునా దేవకీ నన్దనః ॥**

తాత్పర్యము -

బృందావనంలో కదంబ తరుచ్ఛాయలో గోపకామినీ బృందంతో మాధవుడు విహరిస్తున్నాడు. ఆ మధుర మనోహర మూర్తిని చూస్తూ గోపికలంతా పరవశించిపోతున్నారు. ఆయన లీలలు వర్ణించుకుంటూ బ్రహ్మానందంలో తేలిపోతున్నారు.



అందులో ఒక గోపిక మరొక గోపికతో ఇలా అంటున్నది ...."పల్లవీ! మన శ్యామసుందరుడు ఎంత చతురుడో చూశావా! ఒక పక్క కనుబొమల సైగలతో లయ తప్పకుండా తాళం వేయిస్తున్నాడు. మరొక వంక తను వాయిస్తున్న వేణువుననుసరించి పాటలు పాడిస్తున్నాడు. సావధానుడై శ్రీహరి మురళి వాయిస్తున్నాడు. ఈ సంధ్యాసమయంలో మనమందరం స్వామి సన్నిధిలో వుండి, తనివి తీరా తనని చూస్తూ గడిపే సదవకాశం మనకి ప్రసాదించిన ఆ దేవకీనందనుని వేణుగానం వినే భాగ్యం లభించినందున మనమెంత ధన్యులమో కదా!"

వారంతా పొందే మహదానందాన్ని మనం కూడా పొందాలన్న కోర్కె తప్పక తీరుస్తాడు దయామయుడైన మురళీమోహనుడు.

# స్వామి తురీయానంద

కె. భాస్కర్ రాజు

శ్రీ స్వామీ తురీయానంద శ్రీ రామకృష్ణ పరమహంస వారి ప్రధాన శిష్యులలో ఒకరు. వీరు జనవరి 3, 1863 న కలకత్తాలో జన్మించారు. శ్రీ స్వామివారి దివ్యోపదేశాలు కొన్ని యీ క్రింద పొందుపరుస్తున్నాము.

"స్వామీ తురీయానందలో వేదాంతం రూపుదాల్చి కనిపిస్తుంది. అతని జీవితంలో ప్రతిక్షణం వేదాంతం నిండి వుంది. అతడు పవిత్రమైన దివ్య జీవితం గడుపుటకు మీ అందరికి సహాయం చేయగలడు"- అన్నారు స్వామి వివేకానంద.

నిత్యజీవితావసరములు కొరకు ధనార్జన తప్పక చేయాలి. కాని అదే జీవితం కాకూడదు. ధనార్జన న్యాయపరమైనదిగా వుండాలి. ధనం వలన నీవు అనేక పదార్థాలను కొనగలవు, కానీ భగవానుని కొనలేవు, మనశ్శాంతిని కొనలేవు. ధనం నాకు శాశ్వతానందాన్ని యిస్తుందా అని ప్రశ్నించుకుంటే మనకు వచ్చే సమాధానం "లేదు" అనే వస్తుంది.

మనస్సును అనవసరంగా చికాకు పరచుకొంటున్నారు. మీ విచారం మీకు ఏ విధంగా ఉపయోగపడదు, పైగా అది మీ పనిని పాడు చేస్తుంది. భగవంతుడికి అర్పించుకున్నట్లు పెద్ద పెద్ద మాటలు చెప్పి, ఏ విధమైన సాధన (ప్రయత్నము) చేయకపోతే, అది సోమరితనం, అజ్ఞానం అవుతాయి. ఎవరైతే ఉత్సాహ భరితులై కష్టపడి సాధనచేస్తారో వారికి మాత్రమే భగవంతుని సహాయం అందుతుంది. ఎవరైతే ఆత్మస్థైర్యంతో సాధనచేసి గురుదేవునికి సర్వసమర్పణ చేసుకుంటారో వారికి తప్పక సద్గతి లభిస్తుంది.

సాధారణ జీవితం గడుపుతున్న వారెవరూ ఒక్క క్షణం కూడ మట్లాడకుండా ఉండలేరు. అటువంటి వారెవరైనా వుంటే, వారు తప్పకుండా తమ మనస్సుతో తాము మాట్లాడుతూ వుంటారు. అంటే ఆలోచిస్తూ వుంటారు. మాట్లాడకుండా వుండటం యించుమించుగా అసాధ్యం ఇతరులతో మాట్లాడేటప్పుడు అనవసరపు విషయాలే ఎక్కువగా చర్చిస్తాం. ఒంటరిగా వుంటే పనికిరాని విషయాలు గురించే ఎక్కువ

ఆలోచిస్తాం. అందుకు బదులుగా భగవద్విషయములు చర్చించుకుంటూ, భగవన్నామం స్మరించుకుంటూ వుంటే మన సమయం సద్వినియోగం అవటమే కాకుండా, మనస్సు ప్రశాంతత చెంది, ఆధ్యాత్మిక సాధన పురోగమిస్తుంది. ప్రశాంతమైన జీవితం లభిస్తే, సాధనలో పురోగతి లభించినట్లే.

భవగత్కృప, మోక్షము లభించాలంటే ఒక సద్గురువుని ఆశ్రయించి, వారి అనుగ్రహము పొంది సాధన చేస్తే తప్పక ఫలితం లభిస్తుంది. నిరంతరం భగవధ్యానం చెయ్యాలి. అంటే ప్రభువు నామాన్ని ఏకాగ్రతతో స్మరించటం. “పూజకంటే జపం మంచిది, జపం కంటే ధ్యానం ఉన్నత స్థితి. ధ్యానంలో పరిపూర్ణత సాధించిన వ్యక్తి ముక్తపురుషుడు అవుతాడు.”

***శ్రీ సద్గురు మండల దీక్ష***
***24-10-2018 నుండి 3-12-2018 వరకు***
***శ్రీగురు నామ పారాయణ***
***2 కోట్ల, 3 లక్షల, 11వేలు***

***30వ శ్రీ సద్గురు మహాపుణ్యారాధన మహోత్సవములు***
***26-11-2018 నుండి 3-12-2018 వరకు***
***శ్రీ సద్గురు కోటి నామ పారాయణ***
***1 కోటి, 23 లక్షల, 87వేలు***

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

ఒక గురువుగారు శిష్యులకు బోధ చేస్తూ ధ్యాన నిష్ఠలో నిమగ్నమై వున్నారు. శిష్యులు కూడా ధ్యానానికి ఉపక్రమించారు. గురువు గారు అకస్మాత్తుగా ధ్యాననిష్ఠలోనే వుండి, 'అప్పుడే కాదులే, అప్పుడే కాదులే' అనే మాటలు ఆయన ముఖస్తుగా దొర్లాయి. శిష్యులంతా ధ్యానాన్ని మరచి తమ గురుదేవుని వంక చూడటం మొదలు పెట్టారు. అంతలో గురుదేవులు కనులు తెరచి శిష్యులకు బోధ చేస్తూ, 'చూశారా! మాయ ఎంత ప్రమాదమైనదో! మాయ నన్ను హెచ్చరిస్తోంది. నువ్వు నన్ను జయించావు. కృతార్థుడవయ్యావు. ఇంక మోక్షాన్ని సాధించినట్లే' అని హెచ్చరిక చేస్తోంది. మాయని జయించామనుకోవటమే మాయకి లోబడినట్లు సంకేతము అని మీరంతా గ్రహించాలి' అన్నారు.



శ్రీబాబూజీ మహరాజ్ పై ఉదంతాన్ని వివరిస్తూ భక్తులకు మాయను గురించిన సందేశాన్ని అందజేశారు. మాయ అంటే అజ్ఞానమే సుమా! మాయ ఉందా? అనే సందేహం సాధకులందరికీ కలగటం అతి సహజమైన విషయం. మాయను దర్శించినవారెవరూ లేరు. కాని దాని ప్రభావానికి గురి కాని వారు లేరనే విషయం నిర్వివాదాంశం.

భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు శెలవిచ్చినట్లు మాయ అనేది భగవానుని అధీనంలోనే వుంటుంది. దానిని అధిగమించ గలిగిన వారు ఎవరూ లేరు. అయితే పరిపూర్ణ విశ్వాసంతో భగవానుని శరణుజొచ్చిన వారిని ఆయన మాయా ప్రభావము నుండి తప్పక సంరక్షించ గలుగుతాడు. మాయ జ్ఞాని ఆధీనంలో వుంటుంది. ఎంతటి శాస్త్రజ్ఞుడైన లేక పండితుడైనా వేదాంతి అయినా, సృష్టిని గురించి తెలియ జేయగలవారు ఎవరైనా వున్నారా? విత్తనం నుండే చెట్టు ఉద్భవిస్తుంది. చెట్టు నుండి విత్తనాలు ఉద్భవిస్తాయి. ఈ రెండిటిలో ఏది ముందో చెప్పగల శాస్త్రకారులు ఎవరైనా వున్నారా? అదే మాయ. కాబట్టి సర్వ జగత్తు ఈశ్వరుని యొక్క ప్రతిబింబమే సుమా!

మానవుడిలో బుద్ధి, లేక వివేకాన్ని ప్రకాశింపజేసేది ఆత్మ వస్తువే. కాని బుద్ధి ఆత్మవస్తువుని గుర్తించలేదు సుమా! మధురత్వము పంచదార యొక్క లక్షణము. కాని పంచదార తన మధుర స్వభావాన్ని గుర్తించ గలదా? ఈ ఉదంతాలన్నీ మాయని తెలియజేసేవే సుమా!

సాధకునిలోని మనస్సే మాయ. అందువలన మాయ అనేది ప్రతిసాధకునికి తన సాధనలో ప్రగతిని సాధించకుండా అవరోధాన్ని కలిగిస్తుంది. మాయ సాధకుని సంకల్పాల రూపంలోగాని, క్రోధ గుణంగా కాని లేక ఈర్ష్య, అసూయ రూపంలోగాని, మానావమాన రూపంలోగాని బాధిస్తుంది. మాయను జయించాలంటే సద్గురు మూర్తిని ఆశ్రయించి, ఆయన అనుగ్రహానికి పాత్రులయితే తప్ప సాధ్యపడదు" అని శ్రీసద్గురుదేవులు హెచ్చరిక చేశారు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జనవరి 2019, ఫిబ్రవరి 2019 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

జనవరి 2019 : AS 4174, 4914, 5490, 5665, 6065, 6483, 6620, 6815, 7162,
AS 7173, 7420, 7421, 7427, 7429, 7430, 7433, 7438, 7641,
AS 7635 నుండి 7638, 7642, 7645, 7646, 7648 నుండి 7666,
AS 7969, 7670

ఫిబ్రవరి 2019: AS 1913, 5645, 6262, 6702, 6843, 6847, 6848, 7443, 7677,
AS 7682, 7734

మేనేజరు

# యమునాచార్యుడు

కీ.శే. - మద్ది నాగేశ్వరరావు

దక్షిణ దేశంలో ఒక రాజుగారు ఉన్నారు. ఆయన శివ భక్తుడు. రాణీగారు వైష్ణవ భక్తురాలు. ఆ రాణీగారికి రాజుగారిని వైష్ణవమతంలోకి మార్చాలానే పట్టుదల ఉన్నది. కాని అది సాధ్యం కావటం లేదు. రాజుగారి చుట్టూ శైవమహా పండితులు ఉన్నారు. వారిని జయించడం ఎంతటి వారికైనా అసాధ్యంగా ఉండేది.

యమునాచార్యుడనే ఒక బ్రహ్మచారి అసమానమైన మేధా సంపన్నుడనీ, వైష్ణవ భక్తాగ్రేసరుడనీ రాణీగారు కర్ణాకర్ణిగా విని, రహస్యంగా ఆయనను రప్పించి, రాజుగారిని వైష్ణవ భక్తునిగా మార్చాలని చెప్పి ఒప్పించింది.

రాజుగారు కూడా యమునాచార్యుని వాదనను వినడానికి అంగీకరించటమే కాకుండా, శైవ పండితులను జయించగలిగితే, అర్ధరాజ్యాన్నిచ్చి, తన చెల్లెలిని కూడా ఇచ్చి వివాహం జరిపిస్తానని ప్రకటించాడు.

యమునాచార్యునకు, శైవ పండితులకు బ్రహ్మాండమైన వాదోప వాదాలు జరిగాయి. యమునాచార్యుని విజృంభణ ముందు శైవ పండితులు నిలువలేక పోయారు. తమ పరాజయాన్ని వారు అంగీకరించారు.

రాజు వాగ్దానం ప్రకారం, యమునాచార్యునకు అర్ధ రాజ్యాన్ని ఇచ్చి, తన చెల్లెలినిచ్చి, వైభవంగా వివాహం జరిపించాడు. తాను వైష్ణవ భక్తుడిగా మారిపోయాడు. రాణీగారి సంతోషానికి మేరలేదు.

నిజానికి యమునాచార్యుడు పరమ వైరాగ్యమూర్తి. మహాభక్తుడు. కాని పెండ్లి కాగానే ఆ వైరాగ్యము, ఆ భక్తి ఎక్కడికి పోయాయో తెలియదు పూర్తిగా భోగలాలసుడిగా అయ్యాడు. భగవంతుని స్మరణే మరచిపోయాడు. ఇలా కాలం దొర్లిపోతోంది.

యమునాచార్యునకు చిన్నప్పటి నుండి తోటకూర అంటే చాలా ఇష్టం. అంతటి రాజభోగాల మధ్య కూడా తోటకూర మీద అభిమానం చావలేదు. ఒక వృద్ధ బ్రాహ్మణుడు ప్రతిరోజూ స్వయంగా తోటకూర రుచిగా వండి రాజుగారికి పంపించేవాడు. యమునాచార్యుడు

బ్రహ్మానందంగా ఆ కూర తినేవాడు. ఒకరోజున ఆయన 'ఈ కూర ఇంత రుచిగా వండి పంపుతున్నవారెవరు? ఎక్కడిదిది? అమృతంలాగా వుంది' అని అడిగాడు.

దానికి 'ఎవరో వృద్ధ బ్రాహ్మణుడు మీకై స్వయంగా వండి పంపుతున్నాడు' అని సేవకులు సమాధానం చెప్పారు. ఆ మరునాడు ఆ బ్రాహ్మణుని తన వద్దకు తీసుకుని రమ్మనమని రాజు గారు ఆజ్ఞాపించారు. ఆ మరునాడు ఆయనను చూసిన రాజుగారు 'నీకు ఏమి కావాలో కోరుకో' అన్నాడు.

'ఓ రాజా! నాకేమీ అక్కరలేదు. నేను దేనిని ఆశించేవాడిని కాదు. మీ దేశంలో ఒక చోట అక్షయ నిధులు ఉన్నాయి. అక్షయ నిధులు సహజంగా ఆ దేశపు రాజుగారికే చెందుతాయి. వాటిని మీకు అప్పగించాలనేదే నా తాపత్రయం. అందుకే మీ పట్టణానికి వచ్చాను. మీ దృష్టిని ఆకర్షించాలనే ఇలా రోజూ ఈ కూర వండి మీకు పంపించాను. నా ఈ ప్రయత్నం ఫలించింది. మీరు తక్షణం నాతో బయలుదేరి వస్తే, మీకు ఆ నిధులు చూపించి, నా దారిన నేను పోతాను' అన్నాడు ఆ వృద్ధ బ్రాహ్మణుడు.

యమునాచార్యుని ఆశలకు రెక్కలు వచ్చాయి. ఆ నిధులతో మరిన్ని భోగాలు అనుభవించాలనే ఆశతో వెంటనే ఆ బ్రాహ్మణుని అనుసరించాడు. ఆ బ్రాహ్మణుడే తన పాలిట భగవంతుడనుకున్నాడు.

ముందు బ్రాహ్మణుడు, వెనుక యమునాచార్యుడు ఇలా వెళ్ళి వెళ్ళి కాంచీపురం చేరుకున్నారు. బ్రాహ్మణుడు 'రాజా! నిధులున్న ప్రదేశానికి చేరుకున్నాము' అంటూ హెచ్చరిస్తూ సరాసరి వరదరాజస్వామి దేవాలయం లోకి ప్రవేశించాడు. ఇరువురూ ప్రాకారాలు దాటుతూ సరాసరి గర్భగుడిలోకి ప్రవేశించారు. 'రాజా! ఇవిగో! ఆ మహానిధులు! నీ నిధులు నీకు అప్పగిస్తున్నాను. భోగించు!' అంటూ ఆ వరదరాజ స్వామి వారి పాదాలు చూపించాడు. ఆ శ్రీపాదాలను చూడగానే యమునాచార్యునకు భక్తి పారవశ్యం ఉవ్వెత్తుగా లేచింది. కన్నుల నుండి అశ్రుధారలు వర్షిస్తున్నాయి.

ఆ బ్రాహ్మణుడు తేజోరూపుడై ఆ వరదరాజ స్వామిలో కలసిపోయాడు! ఆనాటి నుండి యమునాచార్యుడు ఆ పాదాలకే అంకితమైపోయాడు!

# సత్యభామ

- పాలూరి కాళీప్రసాద్

సత్యభామ కథ ముందుగా హిరణ్యాక్షుడితో మొదలవుతుంది. హిరణ్యం అంటే బంగారం. హిరణ్యాక్షుడు అంటే బంగారం/సంపద మీద దృష్టి. అదే భూదేవిని జలంలో అంటే జడత్వం/అజ్ఞానంలో ముంచేసింది. ఆవిడను ఉద్ధరించడానికి విష్ణుమూర్తి వరాహావతారంలో వచ్చాడు. వరాహం మనం విసర్జించిన దానిని తాను స్వీరించి, మన పరిసరాలను శుభ్రం చేస్తుంది. అలాగే గురుదేవులు మనకు సాధనకు అడ్డువచ్చే మనలోని దుర్గుణాలను, మన ప్రారబ్ధ కర్మలను, వాసనలను అన్నింటినీ వారు స్వీకరించి మన మనస్సులను శుద్ధ మనస్సుగా చేస్తారు. అయితే ఈ ప్రక్షాళన పూర్తి కాకముందే, తొందరపడి ఫలితాన్ని పొందాలనుకుంటే అది దుఃఖానికే దారి తీస్తుంది. అందుకే భూదేవికి నరకాసురుడు జన్మించాడు. నరకమంటే దుఃఖమే కదా! మన దుఃఖం బయట నుండి రాదు. అది మన మనసులోనే పుడుతుంది. అలాగే బయటి ఉపకరణాలేవీ ఆ దుఃఖాన్ని పోగొట్టలేవు. మన దుఃఖాన్ని మనమే విచారణ ద్వారా పోగొట్టుకోవాలి. అందుకే నరకాసురుడికి కేవలం భూదేవి చేతిలోనే మరణం నిశ్చయించబడటం.

మన మనస్సు పరిశుద్ధమైన ఆత్మజ్ఞానం పొందేదాకా ఎన్ని జన్మలైనా గురుదేవులు వదిలిపెట్టరు. అలాగే భూదేవి సత్యభామగా వచ్చినా, మళ్లీ విష్ణుమూర్తి శ్రీకృష్ణుడిగా రావటం జరిగింది. అయితే మనం గురువులను ఆశ్రయించినంత మాత్రాన, లేదా జన్మ చాలించి, మరోజన్మ ఎత్తినంత మాత్రాన మనలోని వాసనా బీజాలు నశించవు. పైగా వాసన పృథ్వీతత్త్వం. 'తత్ర గంధవతీ పృథ్వీ' అని ఉపనిషద్ వాక్యం. అలాగే బంగారం మీద దృష్టి ఆవిడను ఈ జన్మలో కూడా వెంటాడింది. తన తండ్రి సంపాదించిన శమంతకమణి దానికి మరింత ఆజ్యం పోసింది. ఇక భూమికి వున్న మరో లక్షణం ఆకర్షణ. ఆ భూమ్యాకర్షణ లేకపోతే మనకెవరికీ మనుగడ లేదు. ఈ సహజసిద్ధమైన ఆకర్షణ శక్తితోనే సత్యభామ ఊరిలో అందరినీ ఆకర్షించినట్లుగానే పరమాత్మను కూడా ఆకర్షించి తన కొంగుకు కట్టుకోవాలని భావించింది.

అయితే కేవలం భక్తికి తప్ప పరమాత్మ ఇక దేనికీ ఆకర్షింపబడేవాడు కాదు, లొంగేవాడు కాదు. అయితే సత్యభామలో వున్న అతిపెద్ద సుగుణం ఏమిటంటే నిష్కల్మషమైన మనస్సు. పరమాత్మ దగ్గర ఎప్పుడూ మనస్సు దాచదు. తన మనస్సులో ఉన్న భావాలన్నీ నిస్సంకోచంగా ఆయన ముందు

వ్యక్తపరుస్తుంది. కనుకనే ఆవిడ శ్రీ కృష్ణ పరమాత్మకు అత్యంత ప్రీతిపాత్రమైనది. ఆయన ఆమెకు బంగారం మీద ఉన్న దృష్టి, ఆకర్షణ అనే వాసనలను సమూలంగా నాశనం చేసి ఆవిడను ఉద్ధరించడానికి సంకల్పించారు. ఇందాక చెప్పినట్లు గురుదేవులు మార్గం చూపిస్తారేకాని, ఎవరి దుఃఖాన్ని వారే విచారణ ద్వారా తొలగించుకోవాలి. అలాగే కృష్ణుడు మార్గం చూపించగా సత్యభామ నరకాసురుణ్ణి వధించింది.

అయితే ఇంకా తన వాసనలు పోకపోవడంతో సాక్షాత్తూ ఆశ్రితపారిజాతమైన పరమాత్ముడు తన వద్దనే వున్నా సత్యభామ స్వర్గం నుండి పారిజాతవృక్షాన్ని పోరాడి మరీ తెచ్చుకుంది. కానీ అది కూడా ఆయనను పూర్తిగా తనకే సొంతం చేయలేక పోయింది. చివరికి సత్యభామ కృష్ణుని తనవాడిగా చేసుకోవటం కోసం, ఆ పారిజాతాన్ని, తనకున్న సమస్త సంపదలను, బంగారం నిల్వలనూ వదులుకోవడానికి సిద్ధపడింది. అయితే ఈ భౌతిక సంపదలను ఎంత త్యాగం చేసినా పరమాత్ముని పొందటం అసాధ్యం. ఎందుకంటే ఆ సంపదలేవీ మనతో వచ్చేవి కావు. తీసుకు పోగలిగేవి కావు. మనం నిజంగా త్యాగం చేయవలసింది జన్మజన్మాంతర వాసనలను. భగవంతుని ప్రేమను పొందడానికి భక్తి ఒక్కటే సాధనమనీ, తనకున్న సంపదలు, ఆకర్షణ శక్తి ఆయనను బంధించలేవని జ్ఞానోదయమై సత్యభామ చివరికి సంపద మీద తన దృష్టిని, తన ఆకర్షణ శక్తిని ఈ రెండు వాసనలను వదిలించుకొని పరమాత్మకు సంపూర్ణ శరణాగతి పొందటం ద్వారా ఆయనను తనవాడిగా చేసుకుంది. ఇప్పుడావిడకు ఆయన కేవలం తనకు మాత్రమే చెందాలనే స్వార్థం లేదు. ఎందుకంటే ఆయన అందరివాడని, ఆ అందరూ కూడా తనవారేననే జ్ఞానం కలిగింది.

అయితే ఇలాంటి చరిత్రలు చదివేటప్పుడు 'దేవుళ్ళకి కూడా ఇలాంటి బలహీనతలు, మనోమాలిన్యాలు వుంటాయా? అలా వుంటే వారు మనకన్నా ఎందులో గొప్ప?' అనే సందేహం కలుగుతుంది. అయితే ఇక్కడ గమనించ వలసిన విషయం ఏమిటంటే ఇది కేవలం మనకు పాఠం నేర్పటం కోసం వారు నడిపించిన జగన్నాటకమే  కానీ దైవత్వంలో క్షుద్రత్వానికి ఆస్కారం లేదు. ఉదాహరణకు మనం పూజచేసుకునే ముందు ఒక పువ్వు నేలమీద పడితే అది పూజకు పనికిరాదని తీసి ప్రక్కన పెడతాం. కానీ అదే పువ్వు ఒకసారి భగవంతుని శిరస్సుపై అలంకరించిన తరువాత ఆ పువ్వు క్రిందపడినా కూడా చటుక్కున తీసి మళ్ళీ దేవుని శిరస్సుపైన పెట్టేస్తాం. ఒకసారి దేవుని చేరిన పువ్వుకే మళ్ళీ మాలిన్యం లేదంటే ఇక దేవుళ్ళకు ఎందుకు వుంటుంది?

(గత సంచిక తరువాయి)

# కైవల్యోపనిషత్

- రేఖ

అంతటి ఆవేదన కలిగి వుండాలి. అప్పుడు ముత్యపుచిప్ప ఎలా అయితే స్వాతి చినుకు పడగానే మూసుకు పోయి సముద్రం అట్టడుగుకు వెళ్ళిపోయి, కొంతకాలానికి అందులో ముత్యం తయారవుతుందో, అదే విధంగా సాధకుడు కూడా అంత ఆవేదనతో వుండి, మననం నిదిధ్యాసల ద్వారా తను చేరుకోవలసిన గమ్యం చేరుకుంటాడు.

శ్రీ మాతాజీ పాలను ఉదాహరణగా విశదీకరించారు - పాలని పొంగబెట్టటం అంటే జీవితంలో ఏది గొప్పదో చేరవలసిన గమ్యం ఏదో గుర్తించి, మహాత్ముల అనుగ్రహం కోసం ఆవేదనతో ఎదురు చూస్తూవుంటే, పాలు పొంగుతూ వుంటే వచ్చే సువాసనలా, ఆ సాధకుడి హృదయం కూడా ఆవేదనతో, ఆనందంతో, భక్తితో, ఆర్తితో నిండి ఎంతో అందంగా, స్వచ్ఛంగా, తెల్లగా పాలలాగా వుంటుంది. అది పరిపక్వత చెందిన హృదయం. గురువు ఆ ఆవేదనను గ్రహించి, ఆ సాధకుడికి తోటి సత్సంగీయుల ద్వారా సద్విషయాన్ని గురించి ఇంకా బోధింపజేసి, తగిన సమయం చూసి ఉపదేశం చేస్తారు.

ఎలా అయితే మరీ వేడిగా లేదా మరీ చల్లగా కాకుండా చూసి పాలలో తోడు వేస్తామో అదే విధంగా తిరిగి గురూపదేశం సమయంలో కూడా జరుగుతుంది. దానికి పౌర్ణమి, అమావాస్య అనే మంచి రోజులతో పని లేదు. దొంగలు, రాక్షసులు చీకటిలోనే వస్తారు. అలాగే మనలోని దుర్గుణాలు అనే రాక్షసులను, మనలోని చీకటిని పారద్రోలటానికి గురు లక్ష్యార్థం (మంత్రం) ధ్యానించాలి. అది ఏ సమయంలోనైనా ధ్యానించవచ్చు.

నిన్ను నువ్వు గుర్తించాలి అనే ప్రయత్నంలో శ్రద్ధ, జాగరూకత కలిగి వుండాలి. ఆ ప్రయత్నానికి కావలసిన పథ్యం సాధకుడే చేయాలి. అందుకనే బ్రహ్మవిద్య అంత నిగూఢమైనది. సాధన కూడా నిగూఢమైనది. అది సాధకుడికీ, గురువుకే తెలియాలి. ఎందుకంటే బాహ్య విషయాల వలన, అజ్ఞానం, అవిద్యలతో కూడిన భావనవల్ల, సాధకుడిలోని లోపాల వల్ల సాధన కుంటుపడే ప్రమాదమున్నది. అందువల్ల ఎవరి జాగ్రత్తలు వారే తీసుకోవాలి. ఎవరి ఆకలి, రుచులు వారికే తెలుసన్నట్లుగా. కనుకనే నిగూఢం అన్నారు. దేనిని ఆచరించటం వలన సర్వ పాపాలనుండి విడివడి, విద్వాంసుడు (అంటే జ్ఞానం కలిగినవాడు) ఆ పరమాత్మను

చేరుతున్నాడో, అటువంటి బ్రహ్మవిద్యను తనకు బోధించమని అశ్వలాయన మహర్షి వేడుకున్నాడు.

మన దృష్టిలో పాపాలు అంటే ధ్యానంలో అడ్డుపడేవన్నీ పాపాలే. బ్రహ్మవిద్యకు అధికారి అవ్వాలి. సద్విషయమందు అధికారికి తీవ్రతరమైన దృష్టి వుండాలి. అప్పుడు మనకు తెలియని విషయం తెలుసుకోవాలన్నా, సంశయ నివృత్తి అవాలన్నా, భగవంతుడు మహాత్ముల ద్వారానో, లేక వార్తాపత్రిక ద్వారానో విషయం తెలియజేసి, సందేహ నివృత్తి చేస్తాడు. మనం ఎంత పుణ్యాత్ములమో, మనకు అటువంటి సద్విషయం గురించి ఆలోచన రావడం, భగవంతుడు మనకు ఏదో విధంగా తెలియ జేయటం అనేది జరగటం అని శ్రీమాతాజీ ఉద్బోధించారు.

భగవంతుడు మనలను సృష్టించాడు. మహాత్ముల ద్వారా మనం వెళ్ళవలసిన మార్గం కూడా చూపిస్తున్నాడు. ఆ మార్గంలో వెళ్ళకపోతే మనది పాపం. మహాత్ముల వేదాంత బోధ ద్వారా మన దృష్టిలో మన ప్రవృత్తిలో మార్పు వస్తుంది. శ్రవణం చేసినదానిని మననం చేస్తే, మనం అనుష్ఠానం చేసుకునేటప్పుడు అది నిదిధ్యాసకి వస్తుంది. శ్రవణ మనన నిదిధ్యాసనలు మనమే చేయాలి. ఎక్కడైతే నిదిధ్యాస ఉన్నదో, ఆ స్థితి మనకు కలిగినప్పుడు కైవల్యం అనే దాన్ని అనుభవించే స్థితి మనకు ఏర్పడుతుంది.

శ్రీమాతాజీ తమ బోధను కొనసాగిస్తూ, 'బ్రహ్మవిద్య, శ్రద్ధ, భక్తి, ధ్యాన యోగముల ద్వారా తెలుసుకోవాలని బ్రహ్మదేవుడు మహర్షికి చెప్పాడు. యోగఃచిత్తవృత్తి నిరోధకః - యోగం అంటే కలయిక. ఉపనిషత్తు చదువుకుని, అర్థతాత్పర్యాలు చెప్పుకుంటే కేవలం శబ్దాలు మాత్రమే వినిపిస్తాయి. అది శబ్దజ్ఞానం అవుతుంది. ఆ శబ్దాలు, వాటి తాత్పర్యం ఆచరించాలి. దాని ద్వారామాత్రమే బ్రహ్మవిద్య అవగతమవుతుంది.

ప్రేమను ఒక ఉన్నత ఆదర్శం వైపు మరలిస్తే అది భక్తి అవుతుంది. ఏమీ చదువుకోకపోయినా గోపికలు, శబరి వంటి భక్తులు ఉపనిషత్ జ్ఞానాన్ని, భగవత్తత్త్వానుభవాన్ని పొందారు. వారు ప్రపంచాన్ని పట్టించుకోలేదు. అసలైన ప్రేమ ఏదంటే తమ జీవితాన్ని ఎవరయితే భగవంతుడికి సమర్పణ చేసుకుంటారో, అదే ప్రేమ. అదే భక్తి. ప్రేమ యొక్క పరాకాష్ఠయే భక్తి. భక్తి యొక్క పరాకాష్ఠయే జ్ఞానం' అన్నారు శ్రీ మాతాజీ.

-సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## బళ్ళారి శాస్త్రిగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీబాబు లీలలు పరమాద్భుతంగా ఉంటాయి. సరిగా ఆ క్రితం సంవత్సరమే (1965)గుండుగొలనులో భోగిరాజమ్మగారింట్లో జరిగిన దసరా పూజలలో 'సత్, చిత్, ఆనందము' అనే విషయాన్ని గురించి శాస్త్రిగారితోనే చర్చ జరిగింది. ఒకరోజు ఉదయం ఎనిమిది గంటలకు శ్రీబాబు సత్సంగ సమావేశానికి విచ్చేశారు. సమావేశం ప్రారంభంలోనే భక్తులొకరు తాము వ్రాసిన 'సత్తు, చిత్తు, ఆనందము' అనే పుస్తకమును శ్రీబాబుకు సమర్పించారు. శ్రీబాబు ఆ పుస్తకమును చూస్తూ "యీ భక్తుని ద్వారా జగన్మాత మనం ఏ విషయమును గురించి యీ రోజు మాట్లాడు కోవాలో తెలియజేసింది. చాలా బావుంది. అన్నగారూ! నాన్నగారి దగ్గర (పరశురామయ్య గారు) మీరు ఎన్నోసార్లు యీ విషయం గురించి విని చర్చించి ఉంటారు. ఇంకా ఎన్నో గ్రంధాల ద్వారా, పండితుల ద్వారా దీన్ని గురించి విచారణ చేసి వుంటారను కుంటాను. నేనేమో చదువుకున్న వాణ్ణి కాను. సత్తు, చిత్తు, ఆనందము అనే యీ మూడు



మాటలున్నాయే, వీటికి అర్థం ఏమిటి? ఇవి మూడూ వేరు వేరు విషయములా? లేక ఒకే దానికి సంబంధించినవా? మీరు వీటిని గురించి చక్కగా నాకూ, వీళ్ళందరికీ అర్థమయ్యేలా వివరించి చెప్పండి" అన్నారు.

శాస్త్రిగారు లేచి "సత్తు , చిత్తు, ఆనందము అని యిలా మూడు పదాలు ఉపయోగించినా, నిజానికి అవి మూడూ భిన్న విషయములు కావు. సత్తులోనే చిదానందములు, చిత్తులోనే సదానందములు, ఆనందములోనే సత్తు, చిత్తులు ఉన్నాయి. ఈ మూడు పదములతో వివరించబడినదే నిరాకార, నిరంజన, నిరామయ, అఖండ, ఏకైక సచ్చిదానంద పరబ్రహ్మ వస్తువు" అన్నారు. శ్రీబాబు "అసలు సత్తు, చిత్తు, ఆనందమూ అంటేనే తెలియని మమ్మల్ని, యింకా నిరంజన, నిరామయ అంటూ ఏవేవో పెద్ద పెద్ద మాటలతో చిక్కుల్లో పడేస్తే యీ తల చిక్కు బేరం మాకెక్కడ చిక్కు విడుతుంది సార్! 'పిల్లి' అంటే ఏమిటి? అని

పిల్లవాడు అడిగితే, మాస్టారుగారు 'మార్జాలము' అన్నారట. ఆ పిల్లవాడు ఏమైపోతాడు చెప్పండి? మరి మా పరిస్థితీ అలాగే ఉంది. కాస్త అర్థమయ్యేట్లుగా చెప్పండి అన్నగారూ! మీరు. చాలా మంచివారు" అన్నారు.

అప్పటి నుండి సుమారు ఆరు గంటల సేపు అదే విషయం పైన శ్రీ బాబు శాస్త్రిగారితో చర్చను కొనసాగించారు. శాస్త్రిగారు ఎన్ని విధాలుగా చెప్పినా, స్వామి చిరునవ్వుతో శాస్త్రిగారు చెప్పేదానిలో ఏదో లోపాన్ని ఎత్తి చూపుతూ శాస్త్రిగారిని కవ్వించారు. రాను రాను శ్రాస్త్రిగారికి సహనం సడలిపోతోంది. చివరకు ఏదో ఒక సందర్భంలో శ్రీబాబు శాస్త్రిగారితో "మరి మానవులు సత్తు కానిది చిత్తు, చిత్తు కానిది సత్తు అని ఎందుకు వాదించుకుంటూ ఉంటారు?" అనేసరికి శాస్త్రిగారు "బుద్ధిలేక" అనేశారు. శ్రీబాబు వెంటనే "సరిగ్గా చెప్పారు అన్నగారూ! అది లోపించటం చేతనే మానవుడు ఎట్ట ఎదుటనే బట్టబయలుగా ఉన్న సత్యాన్ని గుర్తించలేక, అసత్యమును సత్యమని భావించి భ్రాంతిలో పడి కష్టాలు కొని తెచ్చుకుంటున్నారు. బుద్ధి గలిగిన వానికి సత్య వస్తువే సర్వత్రా గోచరిస్తుంది. సత్యమేవ జయతే" అని సమావేశము ముగించి పూజకు వెళ్లిపోయారు.

పూజగదిలోకి వెళ్లగానే శ్రీ బాబు శాస్త్రిగారికి కబురు చేశారు. లోపలికి వచ్చిన శాస్త్రిగారిని దగ్గరకు తీసుకుని, అనునయింపుగా శ్రీ బాబు "అన్నగారూ! యింత సేపూ మిమ్మల్ని కవ్వించి, విసిగించి, చర్చను పొడిగించింది ఎందుకనుకున్నారు? నిజానికి మీరు చెప్పినట్లు సత్తు, చిత్తు, ఆనందమనే మూడు పదములూ తెలిపేది, ఉన్న ఒక్క వస్తువును గురించే. కాని మానవుడు చెట్టు ముందా, విత్తు ముందా అని తర్కంలోకి దిగి, యీ రెండిటికంటె ముందు ఉన్నదీ, ఎప్పుడూ ఉండేదీ, నిత్య సత్యమైనదీ తానే అనే విషయము మరచి పోతున్నాడు. అలా సత్తు చిత్తుల మధ్య పడి నలిగిపోయే చిత్తములను మరమ్మత్తు చేసి, సత్యాన్ని గుర్తింపచేయగల గమ్మత్తు తెలిసిన నెఱజాణ సద్గురువు ఒక్కడే. ఈ సత్యమును మీరూ నేనూ గుర్తిస్తే చాలదు. కనుకనే అందరికీ బాగా మనస్సులలో నాటుకునే విధంగా మీతో చెప్పించాలనే యిలా మిమ్మల్ని శ్రమ పెట్టాను. ఏమీ అనుకోకండి సూమా!" అని ఎంతో ప్రేమతో మాట్లాడి పంపించారు.

-సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణ  కధలు - రమణ ప్రసాద్

# శ్రీ స్వామి వివేకానంద

“ఆయన ప్రవర్తన నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈయన తప్పక పిచ్చివాడై ఉండాలి. నేను విశ్వనాధదత్తా కుమారుణ్ణి అయినా నన్ను ఈ విధంగా సంబోధించటం ఎంత సాహసం? తరవాత ఆయన వెన్న, కలకండ తెచ్చి స్వయంగా తన చేతులతో తినిపించారు. నేను వారిస్తూ “నా చేతికి ఇవ్వండి. నా స్నేహితులతో తింటాను” అన్నాను. “వారికి తరువాత ఇస్తాను” అంటూ తినిపించారు. తదనంతరం నా చేతులు పుచ్చుకుని “త్వరలోనే ఒక రోజు ఒంటరిగా వస్తానని వాగ్దానం చెయ్యి” అని అన్నారు. నేను సరే అనక తప్పలేదు.”



“ఆయన ఆధ్యాత్మిక ప్రవచనాలూ, పారవశ్య స్థితులూ పరికిస్తే ఆయన నిజమైన సాధువుగా గోచరించారు. ఈయన గొప్ప గురువై ఉండగలరా? అన్న ఆలోచన నాలో తళుక్కుమన్నది. నేను ఆయన దగ్గరకు జరిగి నన్ను వేధిస్తున్న, అనేకులను అడిగిన జవాబు లభించని ప్రశ్నను అడిగాను– ‘మహాశయా! మీరు భగవంతుణ్ణి చూశారా?”అని.

“అవును నిన్ను చూస్తున్నంత స్పష్టంగా, ఇంకా స్పష్టంగా చూశాను.” అంటూ ఆయన ఇలా అన్నారు “భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవచ్చు నిన్ను చూస్తున్నట్లుగా, నీతో మాట్లాడుతున్నట్లుగా భగవంతుణ్ణి చూడవచ్చు. కాని ఆకోర్కె ఎవరికి ఉంది? భార్యా పిల్లల నిమిత్తమూ, సంపద కేవలం ఆస్తి పాస్తులకోసమూ లోకులు కడవలకొద్దీ కన్నీరు కారుస్తారు. కాని భగవద్దర్శనం పొందలేదని ఎవరు విలపిస్తున్నారు? ఆయన కోసం మనస్ఫూర్తిగా విలపిస్తే ఆయన తప్పక సాక్షాత్కరిస్తారు.” అన్నారు.

ఆ జవాబు నన్ను ప్రభావితుణ్ణి చేసింది. ఆరోజు ఆయన దగ్గర సెలవు

తీసుకుని కలకత్తాకు తిరుగు ముఖం పట్టాను.

ఆ తరువాత దక్షిణేశ్వరం వెళ్ళాను. ఆయన చిన్న మంచం మీద కూర్చుని ఉన్నారు గదిలో మరెవరూలేరు. నన్ను చూసి పట్టరాని ఆనందంతో పక్కన కూర్చోపెట్టుకున్నారు. కాని మరుక్షణంలో వింతైన మనోభావంలో మునిగిపోయారు. అస్పష్టంగా, గుసగుసగా ఏదో చెబుతూ నన్ను తదేకంగా చూస్తూ నా దగ్గరకు జరిగారు. తన కుడి పాదాన్ని నాపైన ఉంచారు. ఆ స్పర్శ నాలో క్షణంలో విచిత్రమైన అనుభవాన్ని కల్పించింది. నా కళ్ళు తెరుచుకునే ఉన్నాయి. గదిలోని వస్తువులన్నీ గోడలతోసహా గిర్రున తిరుగుతూ అదృశ్యమైపోయాయి. చరాచర ప్రపంచమూ, దానితో పాటు 'నేను' అనే భావన సమస్తం మహాశూన్యంలో లయించి పోతున్నట్లు తోచింది.

నన్ను నేను అదుపులో ఉంచుకోలేక "నన్ను మీరు ఏం చేస్తునారు! ఇంట్లో నాకు తల్లిదండ్రులు ఉన్నారు". అని కేక పెట్టాను. ఆయన పెద్దగా నవ్వి తన చేతులతో నా ఛాతీని తడిమి" అలా అయితే ఇక చాలు . సకాలంలో అంతా జరుగుతుంది'అన్నారు. అలా పలికిన మరుక్షణమే నేను సహజస్థితి లోకి వచ్చాను. మళ్ళీ వస్తానని వాగ్దానం చేసిన తరువాతనే సెలవు పుచ్చుకు వెళ్ళటానికి ఆయన సమ్మతించారు."

"ఒకరోజు ఆయన నాతో 'నువ్వుకోరుకుంటే నీ హృదయంలో కృష్ణుణ్ణి దర్శించగలవు' అన్నారు. 'నాకు కృష్ణుడు గిష్ణుడు లాంటి విషయాలలో నమ్మకం లేదు' అని జవాబిచ్చాను.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL